
రేపటి నుంచి శ్రీవారి తిరుకల్యాణోత్సవాలు!


ముస్తాబైన శేషాచలం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల చిన వేంకన్న ఆశ్వయుజ మాస తిరుకల్యాణోత్సవాలకు శేషాచలం ముస్తాబైంది. ఈ నెల 13 నుంచి 20 వరకు వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. స్వామి, అమ్మవార్లను వధూవరులను చేయడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. వీటిని తిలకించేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఈవో ఎన్వీఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాల సందర్భంగా ఆలయం, పరిసరాలు విద్యుద్దీప కాంతులతో ధగధగలాడుతున్నాయి.

ముఖ్య కార్యక్రమాలు..

● 13న స్వామి, అమ్మవార్లను వధూవరులను చేయడం. రాత్రి 7 గంటలకు గజవాహనంపై గ్రామోత్సవం. ● 14న ధ్వజారోహణ, రాత్రి 9 గంటలకు శేష వాహనంపై గ్రామోత్సవం. ● 16న ఉదయం 7 గంటలకు సూర్యప్రభ వాహనంపై గ్రామోత్సవం, రాత్రి 7 గంటలకు ఎదుర్కోలు ఉత్సవం. ● 17న రాత్రి 8 గంటలకు స్వామివారి తిరుకల్యాణోత్సవం, అనంతరం వెండి గరుడ వాహనంపై గ్రామోత్సవం. ● 18న రాత్రి 7 గంటలకు స్వామివారి రథోత్సవం. ● 19న ఉదయం 7 గంటలకు చక్రస్నానం, రాత్రి 7 గంటలకు శ్రీవారి ధ్వజా అవరోహణ. ● 20న ఉదయం 9గంటలకు చూర్ణోత్సవం, వసంతోత్సవం, రాత్రి 7గంటలకు ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, పవళింపు సేవ.

సురవర వర్షిణి.. మహిషాసుర మర్దిని






నిడమర్రు, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా జిల్లాలోని పలు ఆలయాల్లో శుక్రవారం 1) జంగారెడ్డిగూడెం కన్యకాపరమేశ్వరి 2) రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ మహిషాసుర మర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. 3) నిడమర్రు మండలం పెదనింద్రకొలను తూర్పుపేట రామాలయంలో అమ్మవారిని రూ.1.2 కోట్ల నగదు, 140 కాసుల బంగారంతో ధనలక్ష్మిగా అలంకరించారు. 4) ఏలూరు పత్తేబాదలో కనకదుర్గమ్మ ఆలయంలో భక్తులు.

14 నుంచి ఎంబీబీఎస్ తరగతులు

150కి 122 సీట్ల భర్తీ

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చేరిన విద్యార్థులకు ఈ నెల 14 నుంచి మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయి. కళాశాలలో మొత్తం 150కు 122 సీట్లు భర్తీ అయ్యాయి. ఇంకా 28 ఖాళీగా ఉన్నాయి. ఆలిండియా కోటాలో 3, రాష్ట్ర కోటాలో 2, కన్వీనర్ కోటాలో 23 సీట్లు ఖాళీగా ఉన్నాయని కళాశాల ప్రధానాచార్యుడు ఆచార్య ఎం.శశిధర్ తెలిపారు.

క్రీడా వికాసం.. భవిత ఉల్లాసం

ఉమ్మడి జిల్లాలోని కేవీకేలకు మోక్షం

పాలకొల్లు, న్యూస్‌టుడే: 'రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో క్రీడా వనరులు సమకూర్చబోతున్నాం. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు క్రీడాభివృద్ధికి కొత్త పాలసీ రూపొందిస్తాం. క్రీడాకారులను ప్రోత్సహించడానికి రూ.10 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తాం' ఈ నెల 10న విజయవాడలో నిర్వహించిన క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) సమావేశంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చెప్పిన మాటలివి.

ఉమ్మడి జిల్లాలోని క్రీడాకారులకు మంచి రోజులు వస్తున్నాయి. 2017లో అప్పటి తెదేపా ప్రభుత్వం నియోజకవర్గానికో క్రీడా వికాస కేంద్ర నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసింది. చాలా చోట్ల పనులు ప్రారంభమైనా 2019లో వైకాపా అధికారంలోకి రావడంతో వీటిపై క్రీనీడలు అలముకున్నాయి. 80 శాతం పనులు పూర్తయినా తాడేపల్లిగూడెం, తణుకు వికాస కేంద్రాలను సైతం అలానే వదిలేశారు తప్ప మిగిలిన పనులు పూర్తి చేసి యువ క్రీడాకారులను ప్రోత్సహించలేక పోయారు.


తణుకులో దాదాపు పూర్తయిన భవనం

పనులు పునఃప్రారంభం.. అప్పట్లో ఉమ్మడి జిల్లాలో 14 ప్రాంతాల్లో క్రీడా వికాస కేంద్రాలు మంజూరు చేశారు. పట్టణాలు నియోజకవర్గ కేంద్రాలుగా ఉన్న చోట ఈతకొలనులు, జల క్రీడల వంటి పనులు చేపట్టారు. నేటికీ ఒక్కచోట కూడా పూర్తి గాని దుస్థితి. తాజా నిర్ణయంతో అన్నిచోట్ల త్వరలో పనులు పునఃప్రారంభం కానున్నాయి.

★ ఏలూరు జిల్లా భీమడోలు, ఉంగుటూరు పశ్చిమలో తణుకు, తాడేపల్లిగూడెంలో వికాస కేంద్రాల పనులు ఎక్కువ శాతం పూర్తయ్యాయి. వీరవాసరం, ఆచంట, మొగల్తూరు, పోలవరం నియోజకవర్గంలోని కేఆర్‌పురం ప్రాంతాల్లో నిర్మాణాలు పునాదుల దశలోనే నిలిచిపోయాయి. దీనిపై పశ్చిమ డీఎస్‌డీఓ రాజేశ్ మాట్లాడుతూ శాప్‌కు సంబంధించిన ఇంజినీరింగ్ అధికారులు బదిలీ అయ్యారని కొత్తవారు వచ్చాక పనులు ప్రారంభమవుతాయన్నారు.

ఆమడదూరంలో.. అమృత్‌యోగం

నగర, పురపాలక సంఘాల్లోని శివారు ప్రాంత ప్రజలకు తాగునీరు అందించడం.. మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకాన్ని తీసుకొచ్చింది. రూ.కోట్ల నిధులు మంజూరు చేసి ఏళ్లు గడుస్తున్నా... ఇసుమంతైనా పనులు ముందుకు సాగలేదు. గత పాలకుల నిర్లక్ష్యం... శివారు ప్రజలకు శాపంగా మారింది.

- న్యూస్‌టుడే, ఏలూరు టూటౌన్

మురుగుతున్న రూ.129 కోట్లు

జిల్లా కేంద్రం ఏలూరు నగరపాలక సంస్థలో రెండేళ్ల కిందట ఏడు శివారు గ్రామాలను విలీనం చేశారు. పన్నులు, ఇతర పాలనా వ్యవహారాలన్నీ నగరపాలక సంస్థ ద్వారానే కొనసాగుతున్నాయి. విలీన పల్లెల్లో సుమారు 70 వేలకు పైగా జనాభా ఉంది. వారిని తాగునీటి సమస్యలు వెన్నాడుతున్నాయి. నీటి ఎద్దడి నివారణకు అమృత్ పథకంలో భాగంగా ఏడాదిన్నర కిందట కేంద్రం రూ.129 కోట్లు కేటాయించింది. త్వరితంగా పనులు ప్రారంభించి, ప్రజల దాహార్తి తీర్చాలని అధికారులను ఆదేశించింది. నేటికీ, పనుల్లో ఒక్క అడుగు ముందుకు పడలేదు. కేవలం డిటెయిల్డ్ ప్రాజెక్టు దస్త్రాన్ని మాత్రం అధికారులు తాపీగా పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదించారు. వారి నుంచి అనుమతులొచ్చాకే టెండర్ల ప్రక్రియ చేపట్టాలి. వారు పచ్చజెండా ఊపకపోవడంతో.. పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన మారాయి.


శివారు గ్రామాల్లో మంచినీటి ట్యాంకు వద్ద బారులు (పాతచిత్రం)

గోదావరి జలాల మళ్లింపు.. ఈ పథకంలో టెండర్ల దశ పూర్తవగానే గోదావరి జలాలను శివారు గ్రామాలైన తంగెళ్లమూడి, చొదిమెళ్ల, సత్రంపాడు, వెంకటాపురం, కొమడవోలు, శనివారపుపేట తదితర గ్రామాలకు అందించాల్సి ఉంది. 66 కిలోమీటర్ల మేర పైపులైనులు వేసేందుకు ప్రణాళిక రూపొందించారు. సత్యనారాయణపురం సమీపంలోని వందెకరాల చెరువు, ఏలూరు పంపుల చెరువుల నుంచి పైపులైన్లను ఆయా గ్రామాలకు అనుసంధానిస్తారు. 20 ఎంఎల్‌డీ సామర్థ్యమున్న ట్రీట్‌మెంట్ ప్లాంట్లు నిర్మించాల్సి ఉండగా దీనిలో 10 ఎంఎల్‌డీ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పంపుల చెరువులో, మరో 10 ఎంఎల్‌డీ ప్లాంట్‌ను పోణంగిలో ఏర్పాటు చేసి నీటిశుద్ధి చేస్తారు. విలీన గ్రామాలకు సంబంధించి మొత్తం 11,284 కుళాయిలు ఏర్పాటు చేయాలని లెక్కలు వేశారు. పరిపాలనా ఆమోదం వస్తే గానీ ఆయా పనులు ముందుకెళ్లే పరిస్థితుల్లేవు.

నీటికి కటకట.. శివారు గ్రామాల ప్రజలు మంచినీటికి ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలోనూ బోర్ల నుంచి సరిగా రాకపోవడంతో అల్లాడుతున్నారు. వేసవిలో సమస్య మరింత తీవ్రమవుతుండగా నగరపాలక సంస్థ నామమాత్రంగా ట్యాంకర్లతో నీరందిస్తూ మమ అనిపిస్తోంది. 'ఆమోదం రాగానే యుద్ధప్రాతిపదికన టెండర్లు ఖరారు చేసి పనులు మొదలు పెడతాం. నాణ్యతకు పెద్దపీట వేస్తూ వీలైనంత త్వరగా పనులు పూర్తి చేస్తాం. శివారు గ్రామాలకు త్వరితం అమృత్ జలాలు అందించేలా చర్యలు తీసుకుంటాం' అని కమిషనర్ భాను ప్రతాప్ తెలిపారు.

ఆ ధరలకు ఇసుక అమ్మలేం!

గూటాల, పట్టిసీమ ర్యాంపులు దక్కించుకునేందుకు ముందుకు రాని గుత్తేదారులు

గతంలో.. పగలు, రాత్రి భారీగా ఇసుక తరలించి ఇష్టమొచ్చిన ధరకు అమ్ముకున్నా పట్టించుకున్న నాథుడే లేరు. ఒకవేళ ఎవరైనా అడ్డుపడి అధికారులకు చెప్పినా, బిల్లులు పక్కాగా ఉన్నాయంటూ టిప్పర్లను వదిలేసేవారు.

ఇప్పుడు.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, నిర్దేశించిన ధరలకే ఇసుక విక్రయించాలని, అది కూడా ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జరగాలని చెప్పడంతో పోలవరం మండలంలో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పట్టిసీమలో ఒకటి, గూటాలలో రెండు ర్యాంపులను అధికారులు గుర్తించారు. ఈ మేరకు వాటి నుంచి ఇసుక తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా అధికారులు ఇప్పటికే ప్రకటించారు.


గూటాల ఇసుక ర్యాంపు వద్ద ప్రస్తుత పరిస్థితి

ఇష్టారాజ్యం.. గతంలో పగలు రెండు, మూడు పడవల్లో ఇసుక తరలించేవారు. రాత్రుళ్లు నదిలో డ్రెడ్జింగ్ చేయడంతో తెల్లారేసరికి భారీ గుట్టలు వెలిసేవి. పేరుకే ప్రభుత్వ నిబంధనలు తప్ప.. ఇష్టమొచ్చిన ధరలకు అమ్ముకుని సొమ్ము చేసుకునే వారు.

పోలవరం, కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: గూటాల, పట్టిసీమ ర్యాంపులకు సంబంధించి నది అవతలి ఒడ్డు నుంచి ఇవతలి ఒడ్డుకు పడవలపై ఇసుక తీసుకొచ్చి.. నిల్వ కేంద్రానికి తరలించి విక్రయించాలి. అయితే ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు విక్రయించేందుకు గుత్తేదారులెవరూ ముందుకు రావడం లేదని తెలిసింది. నేరుగా నది మధ్యలోకి టిప్పర్లు వెళ్లే ర్యాంపులకు తప్ప, అవతలి ఒడ్డు నుంచి పడవలపై తీసుకొచ్చి అమ్మే పరిస్థితి కనిపించడం లేదు. అలా తెచ్చేవారి కోసం అధికారులు జల్లెడ పట్టి వెతుకుతున్నారు. 'మూడు ఇసుక ర్యాంపులకు సంబంధించి ప్రతిపాదనలున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన ధరకు అమ్మడానికి ముందుకొచ్చే వారి కోసం ఎదురు చూస్తున్నాము'అని తహసీల్దార్ సాయిరాజు తెలిపారు.

'పల్లె పండగ' పనులపై ప్రభావం!.. ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఈ నెల 14 నుంచి సీసీ రోడ్లు, డ్రెయిన్లు తదితర నిర్మాణాలను ప్రారంభించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా కొయ్యలగూడెం, బుట్టాయగూడెం, తదితర ప్రాంతాల్లో ఇసుక సరఫరా లేక నిర్మాణాలు ఎంత వరకు ముందుకెళతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. కుక్కునూరులో అందుబాటులో ఉన్న ర్యాంపు నుంచి ఇసుక సరఫరా జరగాల్సి ఉందని, రవాణా వ్యయం భారం అవుతుందని స్థానిక గుత్తేదారులు కొందరు పేర్కొన్నారు. గూటాల, పట్టిసీమ ర్యాంపులు తెరిస్తే తప్ప పరిస్థితి మెరుగుపడదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. 'పల్లె పండగ' కార్యక్రమంలో చేపట్టే నిర్మాణాలపై ఇసుక ప్రభావం ఉండబోదు. అందుకు సంబంధించిన చర్యలు తీసుకున్నాం'అని కొయ్యలగూడెం ఎంపీడీవో కిరణ్‌కుమార్ చెప్పారు.

అక్కడ మాకొద్దు బాబోయ్!

చేరేందుకు ఆసక్తి చూపని సబ్‌రిజిస్ట్రార్లు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: స్టాంప్స్, రిజిస్ట్రేషన్‌శాఖకు సంబంధించి పశ్చిమ గోదావరి జిల్లాలో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. బదిలీలు పూర్తయినా తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపురం సబ్‌రిజిస్ట్రార్లుగా ఎవరూ రాలేదు. అక్కడ పని చేయడం మా వల్ల కాదు బాబోయ్ అంటూ చాలా మంది చేతులెత్తేశారు. అసలు కౌన్సెలింగ్‌లో ఎవరూ ఆ కార్యాలయాలను కోరుకోకపోవడం గమనార్హం.

ఎందుకిలా?.. తాడేపల్లిగూడెం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సుమారు 14 మంది ప్రైవేటు వ్యక్తులు పని చేస్తున్నారు.. అక్కడ ఎలాంటి వ్యవహారమైనా వారి కనుసన్నల్లో జరగాల్సిందే. అక్కడ ఏ అధికారి వచ్చినా వారిని దాటుకుని పని చేయడం కష్టమని ఆ శాఖ ఉద్యోగుల నుంచి వినిపిస్తోన్న మాట. ప్రతి కీలకమైన పనిని వారే దగ్గరుండి చేస్తుంటారనే పేరుంది. ఈ కార్యాలయంలో గతంలో కీలకమైన రికార్డులు కనిపించకుండాపోయాయి. అప్పట్లో అదొక సంచలనంగా నిలిచింది. సమీప నియోజకవర్గంలో జాయింట్-2గా ఉన్న ఒక అధికారి ఇక్కడ సబ్‌రిజిస్ట్రార్‌గా వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు సమాచారం. నరసాపురం, పాలకొల్లు కార్యాలయాలు అంటే ఒకప్పుడు ఎంతో పోటీ. కానీ ఇప్పుడు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. నరసాపురం కార్యాలయంలో గతంలో అనిశా దాడులు జరిగినప్పుడు ప్రధానసాక్షిగా ఉన్న ఒక ప్రైవేటు వ్యక్తి హవానే ఇప్పటికీ కొనసాగుతోంది. గతంలో కొంత కాలం అతడ్ని తప్పించినా ప్రస్తుతం పని చేస్తున్న అధికారి అతడ్ని మళ్లీ చేరదీయడంతో పరిస్థితి మొదటికొచ్చింది. ఈ విషయాన్ని భీమవరం జిల్లా రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లగా డీఐజీ స్థాయిలో చర్చలు జరుగుతున్నాయని త్వరలోనే మూడు చోట్లా నియామకాలు పూర్తి చేస్తారని వెల్లడించారు.




జ్యోతి వెలిగిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి, చిత్రంలో ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, విద్యార్థినులతో కలెక్టర్ వెట్రిసెల్వి తదితరులు

అందరూ సమానం.. ప్రతిభే కొలమానం

ఏలూరు గ్రామీణ, ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: కలెక్టరేట్ బంగ్లాలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడారు. బాల్య వివాహాలను ఎదిరించి చక్కగా చదువుకుంటున్న పలువురు విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ★ వట్లూరులో సంయుక్త కలెక్టర్ ధాత్రిరెడ్డి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ మాట్లాడారు.

ఆహార భద్రతకు ఊతం

2028 వరకు ఉచిత పోర్టిఫైడ్ బియ్యం

ఈనాడు డిజిటల్, భీమవరం, తణుకు గ్రామీణం, భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజనలో భాగంగా ఫోర్టిఫైడ్ బియ్యంను 2028 వరకు ఉచితంగా ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఈ ఏడాది డిసెంబరుతో గడువు ముగుస్తుండటంతో 2028 డిసెంబరు వరకు ఆహార భద్రత కార్డుదారులకు ఉచిత బియ్యం పంపిణీకి కేంద్రం ఆమోదించింది.



జిల్లా	పశ్చిమ	ఏలూరు
రేషన్‌కార్డులు	5,67,651	6,31,044
దుకాణాలు	1,052	1,123
స్టాక్ పాయింట్లు	5	6

ఉమ్మడి జిల్లాలో 11,98,695 కార్డులున్నాయి. కేంద్ర ప్రభుత్వం నిర్ణయంతో లబ్ధిదారులకు నాలుగేళ్ల పాటు లబ్ధి చేకూరనుంది. అంత్యోదయ కార్డులు ఉన్న వారికి 35 కిలోల చొప్పున, ఆహార భద్రత కార్డుల వారికి అయిదు కిలోల చొప్పున ఉచిత బియ్యం పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం వీరందరికీ ఫోర్టిఫైడ్ బియ్యం ఇవ్వనున్నారు. వీటిలో ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి-12 పోషకాలుంటాయి.

గుర్తించడం ఇలా.. బియ్యంలో పోషక విలువలు పెంచేందుకు కృత్రిమ విటమిన్లు, సప్లిమెంట్లు కలపడాన్నే ఫోర్టిఫైడ్ అంటారు. ఎంపిక చేసిన పరిశ్రమల్లో మాత్రమే తయారు చేస్తారు. వీటిని గుర్తించడానికి ఒక అధికారిక చిహ్నం ఉంది. ప్యాక్ చేసిన సంచుల మీద నీలిరంగులో ప్లస్‌గుర్తు, దానిపక్కన ఎఫ్ అన్న ఆంగ్ల అక్షరం ఉంటాయి. ఏమేమి కలిపింది దానిమీద ముద్రించి ఉంటుంది.

14న 'మీ కోసం' రద్దు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: నూతన మద్యం పాలసీకి అనుగుణంగా ఈ నెల 14న సోమవారం దుకాణాల వేలం నిర్వహించనున్నందున... కలెక్టరేట్‌లో నిర్వహించే మీ కోసం కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని అర్జీదారులు గమనించాలని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సహకారంపై రుణ భారం

ఉపయోగం లేని ప్రాంతాల్లో గోదాముల నిర్మాణం

ఈనాడు డిజిటల్, భీమవరం, తణుకు గ్రామీణ, నరసాపురం, పెనుగొండ గ్రామీణం, న్యూస్‌టుడే: రైతుల పేరు చెప్పి వైకాపా నాయకులకు లబ్ధి చేకూర్చేందుకు చేపట్టిన గోదాముల నిర్మాణం ప్రాథమిక సహకార సంఘాలకు భారంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పంటను ఎప్పటికప్పుడు కొనుగోలు చేస్తుండటంతో రూ.కోట్ల వ్యయంతో అనువుకాని ప్రాంతాల్లో నిర్మించిన గోదాముల వల్ల ఎవరికి ఉపయోగమని రైతులు ప్రశ్నిస్తున్నారు.

తణుకు మండలం కొమరవరం శివారులో గోదాము నిర్మించారు. దీంతో ఇది కేవలం రెండు, మూడు గ్రామాలకే ఉపయోగం ఉంటుంది. కోనాల, ముద్దాపురం, దువ్వ, తేతలి, మండపాక తదితర గ్రామాల రైతులు పంట నిల్వ చేసుకుంటే ఆయా ప్రాంతాన్ని బట్టి 10 నుంచి 20 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంటుంది.


మొగల్తూరు మండలం రామన్నపాలెంలో గోదాము నిర్మాణం పూర్తయి ఏడాదిన్నరైనా నేటికీ అందుబాటులోకి రాలేదు. ఇక్కడ అవసరం లేకున్నా నిర్మించారనే ఆరోపణలు ఉన్నాయి.

మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా సొసైటీలపై గోదాముల నిర్మాణ భారం వేశారు. వైకాపా అనుయాయులకు లాభం చేకూర్చేందుకు వీటిని తెరపైకి తెచ్చి, సంఘాలపై మరింత ఆర్థిక భారం మోపారన్న విమర్శలు ఉన్నాయి. గోదాము ఒక్కోదానిపై రూ.40 లక్షలు ఖర్చు చేస్తున్నారు. పీఏసీఎస్ తక్షణం రూ.4 లక్షలు భరించింది. మిగతా రూ.36లక్షలు డీసీసీబీ ద్వారా రుణాలు తీసుకున్నారు. ఏడాదికి రూ.4.66 లక్షలు, అసలు రూ.1.26 లక్షల వడ్డీతో చెల్లించాలి.

ఆచంట మండలం చినమల్లంలో గోదాము నివాసాల మధ్యలో నిర్మించారు. వర్షాకాలంలో ఆ ప్రాంతం మునిగిపోతోంది.

ఇదీ పరిస్థితి... జిల్లాకు 129 గోదాములు మంజూరయ్యాయి. నిర్మాణం చేపట్టి ఏడాది దాటినా చాలాచోట్ల నేటికీ అందుబాటులోకి రాలేదు. భీమవరం, కాళ్ల, శేరేపాలెం, మత్స్యపురి, కేశవరం, పిప్పర, మహదేవపట్నం, ఏలూరుపాడు, శృంగవృక్షం, మొగల్లు, మల్లవరం, చేమకూరిపాలెం, రామన్నపాలెం తదితర ప్రాంతాల్లో మల్టీపర్పస్ గోదాములు నిర్మిస్తున్నారు. కానీ ఆ మేరకు వసతులు కల్పించడం లేదు. బిల్లులు మంజూరు చేయకపోవడంతో కొన్నిచోట్ల మధ్యలోనే నిలిచిపోయాయి.

జిల్లాలో సహకార సంఘాలు	122
గోదాముల నిర్మాణం	24
అందుబాటులోకి వచ్చినవి	6
సామర్థ్యం	500 టన్నులు
నిధులు	రూ.10.56 కోట్లు

144 దుకాణాలు.. 5433 దరఖాస్తులు

ముగిసిన గడువు



ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: గడువు ముగిసింది .. అదృష్టవంతులు ఎవరో తేలాల్సి ఉంది. మద్యం దుకాణాల దరఖాస్తులు ఆయా ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లలో ఏర్పాటు చేసిన సీల్ టెండర్ల బాక్సుల్లో ఉన్నాయి. దుకాణాలు ఎవరిని వరిస్తాయో ఎవరికి అవకాశం దక్కుతుందో ఈ నెల 14 వరకు వేచి చూడాల్సిందే. కలెక్టర్ సమక్షంలో దరఖాస్తులను లాటరీ తీసి ఖరారు చేస్తారు. ఈ క్రమంలో 14 వరకు దరఖాస్తుదారులందరూ టెన్షన్ టెన్షన్ గా ఉండాల్సిందే. ఏలూరు జిల్లాలో 144 దుకాణాలకు శుక్రవారం రాత్రికి 5433 దరఖాస్తులు అందాయి. జిల్లా కేంద్రం ఏలూరులో మాత్రం గురువారం నాటికి 343 దరఖాస్తులురాగా శుక్రవారం నాటికి ఒక్కరోజులోనే 395 దరఖాస్తులు రావడం గమనార్హం. దీంతో మొత్తం ఏలూరులో 738 దరఖాస్తులందినట్లు అధికారులు తెలిపారు.

ఎక్సైజ్ స్టేషన్	దుకాణాలు	దరఖాస్తులు
ఏలూరు	41	738
చింతలపూడి	16	783
భీమడోలు	22	1095
పోలవరం	12	597
జంగారెడ్డిగూడెం	16	959
నూజివీడు	16	673
కైకలూరు	21	588

తీరం.. ఘోరం..!


పెదమైనవానిలంక నుంచి చినమైనవానిలంక వెళ్లే రోడ్డులో పొక్లెయిన్‌తో తవ్వకాలు


కేపీ పాలెం బీచ్ నుంచి చినమైనవానిలంక వద్ద కోతకు గురవుతున్న తీరం

పశ్చిమ గోదావరి జిల్లాలోని తీర ప్రాంతాల దుస్థితికి అద్దం పట్టే దృశ్యాలు ఇవి. ప్రకృతి వైపరీత్యాలు, తుపానుల నుంచి సముద్రతీరప్రాంత రక్షణకు గతంలో 'షెల్టర్‌బెల్ట్ ప్లాంటేషన్' పేరుతో సరుగుడు తోటలు పెంచారు. కాలక్రమంలో కొన్ని కొట్టుకుపోగా మరికొన్ని ఆక్రమణకు గురవుతున్నాయి. వీటి స్థానంలో చేపలు, రొయ్యల చెరువులు తవ్వేస్తున్నారు. 'యాంటీ ఎరోజన్ ఎంబాంక్‌మెంట్' ప్రాజెక్టులో భాగంగా నరసాపురం నియోజకవర్గంలో ఆర్థికమంత్రి నిర్మలసీతారామన్ పెదమైనవానిలంక తీరంలో 2022లో రక్షణ గోడ పనులకు శంకుస్థాపన చేశారు. ఇంతవరకూ పనులు మొదలు కాలేదు.

- ఈనాడు, నరసాపురం


చినమైనవానిలంకలోని మడఅడవుల్లో తవ్విన చేపల చెరువులు

ట్రిపుల్ ఐటీలో మురుగు సమస్యకు పరిష్కారం

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు ట్రిపుల్ ఐటీ కళాశాలలో మురుగు నీటిని పైపులైన్ల ద్వారా బయటకు తరలించేందుకు కళాశాల మున్సిపాలిటీతో ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ మేరకు ఒప్పంద పత్రంపై శుక్రవారం సంతకాలు చేశారు. ట్రిపుల్ ఐటీ ఇన్‌ఛార్జి డైరెక్టర్ అమరేంద్రకుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకట రామిరెడ్డిలు మాట్లాడుతూ.. కళాశాలలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా పైపులైను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు ట్యాంకర్ల ద్వారా మురుగు నీటిని బయటకు తరలించామన్నారు.





పశ్చిమ ఉదారత
విరాళాల సేకరణలో తొలిస్థానం



చెక్కులను ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులను ఆదుకోవడంలో పశ్చిమగోదావరి జిల్లా వాసులు ఉదారత చాటుకున్నారు. విరాళాల సేకరణలో జిల్లా తొలి స్థానంలో నిలిచిందని కలెక్టర్ నాగరాణి తెలిపారు. జిల్లాలో సేకరించిన రూ. 1,17,75,351 విరాళాల చెక్కులను వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు శుక్రవారం అందజేసినట్లు ఆమె వెల్లడించారు. ప్రభుత్వం పిలుపు మేరకు జిల్లాలో దాతలు, వివిధ సంస్థలు, ఉద్యోగులు, ప్రజలు స్పందించి విరాళాలు ఇచ్చారని కలెక్టర్ పేర్కొన్నారు. బాధితులకు ఆహార పొట్లాల సరఫరాలోనూ ఇక్కడ దాతలు, విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తమ వంతు సహకారం అందించారన్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వారి దాతృత్వాన్ని చాటుకున్నారని ప్రశంసించారు. వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



అప్పు తిరిగి ఇవ్వలేదన్న మనోవ్యథతో ఆత్మహత్య

భీమడోలు, న్యూస్‌టుడే: తన వద్ద తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వకపోగా- వేధింపులకు గురిచేస్తున్నారన్న మనోవ్యథతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న భీమడోలు మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... ఆగడాలలంకకు చెందిన యాళ్ల ప్రమీల(39) ఏలూరులోని ఓ మిఠాయి దుకాణంలో పనిచేస్తున్నారు. తన జీతంలోని కొంత మొత్తంతో చీటీలు కడుతూ పొదుపు చేసుకున్నారు. ఈ నగదును ఏలూరు శివారు వంగాయగూడేనికి చెందిన సరిపల్లి ప్రేమ, తులసి, కానుమోలు గ్రామానికి చెందిన రత్నబాబు, కిరణ్‌కు అప్పులిచ్చారు. ఆగడాలలంకలో సొంతిల్లు నిర్మించుకుంటున్నానని, అప్పు తిరిగి ఇవ్వాలని అడిగారు. వారు నగదు ఇవ్వకపోగా- కాల్‌మనీ కేసులు పెడతామంటే ప్రమీలను బెదిరిస్తున్నారు. తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె తన మరణానికి ఆ నలుగురే కారణమని లేఖ రాసి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. మృతురాలి తండ్రి యాళ్ల బాలరాజు ఫిర్యాదు మేరకు భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పట్టాల పక్కన మృతదేహం

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఏలూరు రైల్వేస్టేషన్ సమీప రైలు పట్టాల పక్కన గుర్తుతెలియని మృతదేహాన్ని శుక్రవారం రైల్వే పోలీసులు గుర్తించారు. రైలు నుంచి జారిపడి మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని సర్వజన ఆసుపత్రి శవాగారానికి తరలించారు. మృతుని వయసు 35 నుంచి 40 ఏళ్లలోపు ఉంటుందని, కుడి చేయి మణికట్టు కింద త్రిశూలం పచ్చ బొట్టు ఉందని రైల్వే ఎస్సై సైమన్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -125 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 254 చికెన్ స్కిన్‌లెస్ - 264.





గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.25 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

ఏలూరు

• ఏలూరు • దెందులూరు • ఉంగుటూరు

ఓర్పుతోపాటు నేర్పు ఉన్నవారికి ఏ పని లోనైనా విజయం తథ్యం
-విలియం షేక్‌స్పియర్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు తూర్పువీధి: 80081 23847 | ఏలూరు గ్రామీణ: 80085 74535
పెదపాడు, పెదవేగి: 80085 74483 | ఉంగుటూరు: 79933 00492

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే

సమస్య: కొత్తపేట నూకాలమ్మగుడి రోడ్డులో వారం రోజులుగా వీధి దీపం వెలగడం లేదు. ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు.
- వి.రామాంజనేయులు, స్థానికుడు

సమాధానం: సిబ్బందిని పంపి దీపాన్ని బాగు చేయిస్తాం.
- కె.శేషగిరి, విద్యుత్తు ఏఈ

సమస్య: శాంతినగర్ రెండో రోడ్డులోని కాలువలో మురుగు ముందుకెళ్లడం లేదు. దుర్వాసన రావడంతో పాటు దోమల బెడద అధికంగా ఉంది. **- రాంబాబు, స్థానికుడు**

సమాధానం: కాలువలో పూడిక తీయించి, దోమల నివారణకు మందు పిచికారీ చేయిస్తాం **- జి.చంద్రయ్య, నగరపాలక సహాయాధికారి**

సమస్య: శనివారపుపేట జడ్పీ పాఠశాల ముందు రోడ్డులో వీధి దీపం వెలగడం లేదు. చీకట్లో రాకపోకలు సాగించాల్సి వస్తోంది.
- శ్రీనివాసరెడ్డి, స్థానికుడు

సమాధానం: సిబ్బందిని పంపి వీధి దీపానికి మరమ్మతులు చేయిస్తాం. **- కె.శేషగిరి, విద్యుత్తు ఏఈ**

సమస్య: పడమరవీధి బాలల మ్యూజియం పాఠశాల రోడ్డులోని ప్రధాన కాలువలో మురుగు పారడం లేదు. రోజుల తరబడి నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోంది. **- జి.రాధాకృష్ణ, స్థానికుడు**

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువను శుభ్రం చేయిస్తాం. **- శివారెడ్డి, నగరపాలక అదనపు అధికారి**

పాదుల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

కైకరం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: కైకరంలోని ఓ విద్యుత్తు స్తంభానికి పిచ్చిమొక్కల పాదులు ఎగబాకడంపై 'అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికన శుక్రవారం 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. ఇందుకు విద్యుత్తు శాఖ గొల్లగూడెం సెక్షన్ ఏఈ వేణు స్పందించారు. సిబ్బందిని పంపి స్తంభాన్ని అల్లుకున్న పాదులను తొలగింపజేశారు.

విద్యాభివృద్ధికి ఎనలేని కృషి


సన్మానం అందుకున్న ప్రధానోపాధ్యాయుడితో కమిటీ సభ్యులు

చేబ్రోలు(ఉంగుటూరు), న్యూస్‌టుడే: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నారాయణపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ నాగూర్ మీరా సాహెబ్ జిల్లా స్థాయి పురస్కారం అందుకున్న విషయం విదితమే. ఆయన్ను చేబ్రోలు మదీనా మసీదులో కమిటీ సభ్యులు శుక్రవారం సత్కరించారు. చేబ్రోలులో ఉర్దూ పాఠశాలకు నాగూర్ మీరా సాహెబ్ అయిదున్నర సెంట్లు సొంత స్థలం విరాళంగా ఇచ్చారని గుర్తు చేశారు. ఇమామ్ మహ్మద్ ఇర్ఫాన్, మసీదు కమిటీ అధ్యక్షుడు షా మహ్మద్ హుస్సేన్, సభ్యులు పాల్గొన్నారు.

అయిగిరినందిని.. విశ్వవినోదిని


ఏలూరు: మహిషాసురమర్దిని

ఏలూరు, ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవోపేతంగా సాగుతున్నాయి. తొమ్మిదో రోజైన శుక్రవారం అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో... దుష్టసంహారినిగా భక్తులకు అభయ ప్రదానం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకొని.. అయిగిరినందిని నందితమేదిని విశ్వవినోదిని నందనుతే అంటూ శక్తిస్వరూపిణికి ప్రణమిల్లారు. మహిళలు కుంకుమార్చనలు, లలితా సహస్రనామ పారాయణ, దేవీ ఖడ్గమాల స్తోత్రపారాయణను వేదోక్తంగా నిర్వహించారు. ఏలూరు నగరంలోని అన్ని ఆలయాలతో పాటు ఉంగుటూరు, పెదపాడు, పెదవేగి, నిడమర్రు, భీమడోలు మండలాల్లోని అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేకాభిషేకాలు, పూజలు చేశారు. కురెళ్లగూడెంలో కనకదుర్గ అమ్మవారిని రూ.7 లక్షలు కరెన్సీ నోట్లతో ధనలక్ష్మీదేవిగా అలంకరించారు. ఆలయాలకు విచ్చేసిన భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.
- న్యూస్‌టుడే బృందం


నిడమర్రు: మండలపర్రులో..




పత్తేబాదలో..


ఏలూరు: సుంకరవారీతోటలో..


ఏలూరు: 12 పంపుల కూడలిలో..


వంగాయిగూడెంలో..


ఏలూరు: సారె తెస్తున్న మహిళలు


భీమడోలు: సామూహిక కుంకుమ పూజలు

ఏలూరు సినిమా

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే

అంబిక డీలక్స్	కమిటీ కుర్రోళ్లు
అంబిక మినీ	రామనగర్ బన్నీ
సాయిబాలాజీ	మా నాన్న సూపర్ హీరో
బాలాజీ	శ్వాగ్
సత్యనారాయణ స్క్రీన్ 1	విశ్వం
సత్యనారాయణ స్క్రీన్ 2	వేట్టయన్
సత్యనారాయణ స్క్రీన్ 3	వేట్టయన్
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	దేవర
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	సెలబ్రెటీ
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	జిగ్రా
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	వేట్టయన్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	వేట్టయన్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	విశ్వం
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4	విశ్వం

అంతటా అపరిశుభ్రత!


పాఠశాల భవనాలను ఆనుకుని పేరుకుపోయిన మురుగు

గణపవరం, న్యూస్‌టుడే: స్థానిక జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలలో 380 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాత భవనం శిథిలం కావడంతో ఇటీవల నిర్మించిన భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. వీటిని ఆనుకుని రెండడుగుల మేర మురుగునీరు పేరుకుపోయింది. దాంతో తీవ్ర దుర్గంధం వస్తోంది. విధిలేని పరిస్థితుల్లో అపరిశుభ్రత వాతావరణంలోనే పిల్లలు విద్యాభ్యాసం చేస్తున్నారు. భవనాన్ని పల్లపు ప్రాంతంలో నిర్మించడంతో సమస్య నెలకొందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. మురుగు కారణంగా దోమలు వృద్ధి విద్యార్థులపై దాడి చేస్తున్నాయి. ఫలితంగా వారు అనారోగ్యంగా బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విధి లేని పరిస్థితుల్లో మురుగు నీటిలోనే నడుస్తూ... ఉపాధ్యాయులు, విద్యార్థులు మరుగుదొడ్లకు వెళ్లాల్సి వస్తోంది. మురుగునీటిని బయటకు పంపేందుకు పాఠశాల సిబ్బంది ప్రయత్నిస్తున్నా... ఫలితం లేకుండా పోతోందని పలువురు ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఇకనైనా విద్యా శాఖ, పంచాయతీ అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని వారు కోరుతున్నారు. దీనిపై ప్రధానోపాధ్యాయుడు మూర్తిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా- మురుగు బయటకు వెళ్లే మార్గం లేదన్నారు. బయట నుంచి మోటారు తీసుకొచ్చి తోడేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అయినప్పటికీ మిగతా నీరు బయటకు వెళ్లడం లేదని ఆయన తెలిపారు.

ఎస్సైల బాధ్యతలు స్వీకరణ

పెదవేగి, దెందులూరు, న్యూస్‌టుడే: పెదవేగి ఎస్సైగా కె.రామకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న వి.రాజేంద్రప్రసాద్ కృష్ణా జిల్లాకు బదిలీ అయ్యారు. రాజమహేంద్రవరంలో విధులు నిర్వర్తిస్తూ రామకృష్ణ బదిలీపై పెదవేగి వచ్చారు. ★ దెందులూరు ఎస్సైగా ఆర్.శివాజీ బాధ్యతలు చేపట్టారు. తొలుత స్టేషన్‌లో ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు స్టేషన్ సిబ్బంది, ఎన్డీయే నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పేదలకు కూటమి ప్రభుత్వం అండ

కైకలూరు, న్యూస్‌టుడే: నిరుపేదలకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ, తెదేపా నేత కమ్మిలి విఠల్‌రావు అన్నారు. నిత్యావసర ధరలు అధికమైన తరుణంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు బజారులో రాయితీ వంట నూనెలు అందించాలని నిర్ణయించారు. శుక్రవారం స్థానిక రైతు బజారులో ఏర్పాటు చేసిన రాయితీ వంట నూనెల దుకాణాలను కూటమి శ్రేణులతో కలిసి ప్రారంభించారు. ఇక నుంచి చౌకధరల దుకాణాల్లోనూ నాణ్యమైన కందిపప్పు రాయితీపై అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే

దుగ్గిరాల(పెదవేగి), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ సమస్యలపై ప్రజల నుంచి శుక్రవారం వినతులు స్వీకరించారు. ఆయా సమస్యలను త్వరితం పరిష్కరించాలంటూ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ... ఎన్డీయే వంద రోజుల పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. విపత్తుల వేళ ప్రభుత్వం పేదలకు అండగా నిలిచిందని గుర్తుచేశారు.



భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న చింతమనేని

పెదవేగి: వంగూరులో సామాజిక భవన నిర్మాణానికి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శుక్రవారం భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. రామాలయ సమీపంలో అందరికీ ఉపయోగపడేలా కాసర్నేని రాయబాబు తోడ్పాటుతో సామాజిక భవన నిర్మాణానికి ముందుకురావడం అభినందనీయమని కొనియాడారు. అంతకుముందు రామాలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

దెందులూరు: వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యాన దెందులూరులో తక్కువ ధరలకు వంట నూనెల విక్రయ కేంద్రాన్ని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం మార్కెట్‌లో రూ.125 ఉన్న పామాయిల్‌ను రూ.110కి, రూ.138 ఉన్న సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను రూ.124కి ప్రభుత్వం రాయితీపై అందిస్తోందని తెలిపారు.

రాష్ట్రాభివృద్ధే ధ్యేయం: మంత్రి

నూజివీడు, న్యూస్‌టుడే: రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పాలన సాగిస్తోందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు మండలం పల్లెర్లమూడిలో రూ.4 లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారికి మంత్రి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నామన్నారు. యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశగా నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వరద బాధితులకు 15 రోజుల్లోనే పరిహారం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు. వంద రోజుల ఎన్డీయే పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. కేవలం ప్రతిపక్షాలు మాత్రమే ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం సమకూరింది. హైదరాబాద్‌లోని చాందనగర్‌కి చెందిన విస్సంశెట్టి రాధిక ఆ మొత్తాన్ని దేవస్థానం సూపరింటెండెంట్ రాజుకి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతను ప్రత్యేకంగా అభినందించి, స్వామివారి ప్రసాదాలు, నిత్యాన్నదాన పత్రం అందజేశారు.

ప్రథమ వర్ధంతి

ఆప్యాయతానురాగాలకు మారుపేరుగా మా అందరి హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన మీరు మా నుండి దూరమై సంవత్సరకాలం గడచిననూ మీ మధుర స్మృతులు సదా చిరస్మరణీయం. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..

శ్రీమతి నూకల మాధవి రత్నకుమారి గారు

జననం: 18-04-1970 మరణం: 24-10-2023

భర్త: నూకల చంద్రమౌళి

కుమారుడు: నూకల జశ్వంత్

కుమారుడు: నూకల లిఖిత్ కోడలు: సుమంతి

తండ్రి: పుప్పాల మస్తానరావు తల్లి: సీతామహాలక్ష్మి

చెల్లెలు: గౌతు మాలతి - రాంబాబు

సోదరులు: పుప్పాల మౌలాలి - నాగవేణి

పుప్పాల సుభాని - దుర్గ

మరియు కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు

రహదారులా... మడుగులా!



నిడమర్రు మండలంలో కురుస్తున్న వర్షాలతో రహదారులు మడుగుల్లా తయారవుతున్నాయి. ఫలితంగా ఆయా గ్రామాలకెళ్లే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిడమర్రు - పత్తేపురం మధ్య గోతులు మడుగుల్లా మారాయి. ముఖ్యంగా ఏది గొప్పో ఏది గొయ్యో తెలియక చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి గోతులు పూడ్పించి, రహదారిని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, నిడమర్రు

పోలీసుల సేవా పథం

భవానీలకు అల్పాహారం, పండ్లు పంపిణీ

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: దసరా నేపథ్యంలో కనకదుర్గమ్మ దర్శనార్థం విజయవాడ కాలినడకన వెళ్తున్న భవానీ భక్తులకు ఏలూరు పోలీసులు పండ్లు, అల్పాహారం, మజ్జిగ, మంచినీరు శుక్రవారం పంపిణీ చేశారు. ఆశ్రం శివారు జాతీయ రహదారి తనిఖీ కేంద్రం వద్ద డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో వీటిని అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. పాదయాత్రగా జాతీయ రహదారిపై విజయవాడ వెళ్లే భక్తులు జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం భక్తుల సంచులకు రేడియం స్టిక్కర్లు అంటించారు. రాత్రివేళ స్టిక్కర్ల కాంతితో వాహనదారులు భక్తులను గుర్తించేందుకు అవకాశం ఉంటుందని, తద్వారా ప్రమాదాలను నివారించవచ్చని డీఎస్పీ తెలిపారు.



భక్తులకు పండ్లు అందజేస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

'వేధింపులతోనే అచ్యుత్ ఆత్మహత్యాయత్నం'

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : విజయవాడ ప్రభుత్వ వైద్య శాలలో చికిత్స పొందుతున్న ఏలూరుకు చెందిన విద్యార్థి అచ్యుత్‌ను ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం. సాయికుమార్, పీడీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఐ.రాజేష్. ఏలూరు జిల్లా అధ్యక్షుడు నాని, యువజన కాంగ్రెస్ నాయకులు సతీష్ రాయల్, వైకాపా విద్యార్థి విభాగం నాయకుడు వైవీవీ శివరాం శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొంతకాలంగా అచ్యుత్ చదువుతున్న విద్యాసంస్థల కరస్పాండెంట్ ఆగడాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ధ్రువపత్రాలు ఇవ్వకుండా మానసికంగా హింసించడం వల్లే అచ్యుత్ ఆత్మహత్యాయత్నం చేశారని ఆరోపించారు. దీనికి కారణమైన కరస్పాండెంట్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి పోలీసులు అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకపోతే విద్యార్థి, యువజన సంఘాలు కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఏలూరు నగర అధ్యక్షుడు ఎం. క్రాంతి, ఏఐఎస్ఎఫ్ నాయకులు సాధిక్‌బాబు, రంజిత్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బాధితుడిని పరామర్శిస్తున్న నాయకులు సాయికుమార్, రాజేష్ తదితరులు

నీటి తరలింపులో వివాదం

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పంచాయతీ నీటి ట్యాంకర్ తరలింపులో వివాదం తలెత్తడం, పోలీసుస్టేషన్ నుంచి పిలుపు రావడంతో ఓ యువకుడు మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసుల కథనం మేరకు... పెదవేగి మండలం ఒంగూరుకు చెందిన బోయిన ఫణికుమార్ గత ఆదివారం పంచాయతీ మోటారు నుంచి ట్యాంకరులో నీటిని నింపుకొని వెళ్తుండగా- మోటారు ఆపరేటర్ అడ్డుకున్నాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆ తర్వాత ఫణికుమార్, అతని తండ్రి ఏడుకొండలు, సోదరుడు హరిపై పెదవేగి పోలీసుస్టేషన్‌లో ఆపరేటర్ ఫిర్యాదు చేశాడు. ఈ నెల 10న ఫణికుమార్‌ను స్టేషన్‌కు పిలిపించి మాట్లాడి పంపారు. మనస్తాపానికి గురైన యువకుడు శుక్రవారం పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడ్ని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.


శ్రీ రామ జయం
ప్రజానాయకునికి
విజయదశమి శుభాకాంక్షలు
శ్రీ చింతమనేని ప్రభాకర్ గారు
శాసనసభ్యులు, దెందులూరు నియోజకవర్గం
దశాబ్దాల కాలంగా ప్రజల అభిమానం చూరగొన్న నేతగా...
కార్యదక్షత గల నాయకునిగా... నిబద్ధత కలిగిన సేవకునిగా...
సమర్ధవంతమైన రాజకీయవేత్తగా... "అన్యాయాన్ని ఎదిరించే పోరాట యోధులుగా..."
డేరింగ్ & డాషింగ్ & డైనమిక్ "లీడర్"
శ్రీ చింతమనేని ప్రభాకర్ గారికి
విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తూ...
భవిష్యత్తులో అత్యున్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షిస్తూ...
గుత్తికొండ రాజశేఖర్
సాయి పద్మజ ఆక్సిజన్, బొల్లారం, హైదరాబాద్.

ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

అమ్మవారి సేవలో జడ్పీ ఛైర్‌పర్సన్

పెదపాడు, న్యూస్‌టుడే: మండలంలోని సత్యవోలులో జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ దంపతులు శుక్రవారం పర్యటించారు. గ్రామంలోని ఆలయంలో మహిషాసురమర్దినిగా అలంకరించిన అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకు ముందు ఆలయానికి చేరుకున్న జడ్పీ ఛైర్‌పర్సన్ దంపతులకు గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని స్థానికులు పద్మశ్రీ దృష్టికి తెచ్చారు. వాటిపై ఆమె సానుకూలంగా స్పందించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం ప్రీమియర్ లీగ్ పేరుతో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు ప్రారంభించారు. తొలి పోటీలో తిరువూరు-నిడదవోలు జట్లు తలపడ్డాయి. కార్యక్రమంలో నిర్వాహకులతో పాటు తెదేపా నాయకులు పరిమి సత్యనారాయణ, పెనుమర్తి రామ్‌కుమార్, కొండ్రెడ్డి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



పెదయడ్లగాడి వంతెనపై నిలిచిన వర్షపు నీటిలో రాకపోకలు



భారీ గొయ్యి ఇలా..



రక్షణ గోడపై మొలిచిన మొక్క

వంతెన.. ఇంతేనా..!

ఏలూరు - కైకలూరు ప్రధాన రహదారి పెదయడ్లగాడి వంతెనపై ప్రమాదకర స్థితికి చేరింది. దీనిపై భారీ గోతులు పడటంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాన నీరు కిందికి పోయేందుకు ఏర్పాటు చేసిన రంధ్రాలు మూసుకుపోవడంతో. . చిన్నపాటి వర్షానికే వంతెనపై నీరు నిలిచిపోతోంది. రక్షణ గోడలపై మొక్కలు మొలిచి బీటలు వారుతున్నాయి. అధికారులు స్పందించి వంతెనకు వెంటనే మరమ్మతులు చేయాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు. **- ఈనాడు, ఏలూరు**

శివారు.. సమస్యల హోరు!

ఇబ్బందులు పడుతున్న స్థానికులు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే

ఏలూరు నగర శివారు కాలనీల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ప్రధానంగా అల్లూరి సీతారామరాజు క్రీడా మైదానం వెనుక రోడ్డులో నివసించే ప్రజలు వసతుల లేమితో ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు, మురుగు కాలువలు పారిశుద్ధ్యం లోపించడంతో సతమతమవుతున్నారు. చిన్నపాటి వర్షానికే మోకాలి లోతులో నీరు నిలిచిపోతోంది. మైగా భారీ గోతులు ఏర్పడటంతో.. అందులో నీరు చేరి తటాకాలను తలపిస్తున్నాయి. ఇక మురుగు కాలువల వ్యవస్థ మరింత దయనీయంగా ఉంటోంది. పూర్తిస్థాయిలో కాలువలు లేకపోవడంతో మురుగు ముందుకెళ్లక పేరుకుపోతోంది. రోజులు తరబడి నిల్వ ఉండటంతో దుర్వాసన రావడంతో దోమల బెడద అధికంగా ఉంటోంది. చెత్త కుప్పలు ఎక్కడికక్కడ పేరుకుపోయి అపరిశుభ్రత నెలకొంటోంది. తమ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే నాథుడే లేకపోయారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'ఏఎస్‌ఆర్ స్టేడియం వెనుక కాలనీలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. సిబ్బందిని పంపి కాలువలు శుభ్రం చేయడంతో పాటు చెత్తాచెదారాలు తొలగిస్తాం' అని నగర కమిషనర్ భానుప్రతాప్ తెలిపారు.



పించను లైన్ రోడ్డులో పేరుకుపోయిన చెత్త



ఏఎస్‌ఆర్ స్టేడియం వెనుక మార్గంలో నిలిచిన మురుగు

శాకాహారంపై ఇంటింటి ప్రచారం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జీవహింస మాని శాకాహారం తీసుకోవాలని మహా కరుణ యాగం పేరుతో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మహా కరుణ ధర్మ ప్రచార పరిషత్తు ఛైర్మన్ దాట్ల రాయజగపతి రాజు పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెం పిరమిడ్ వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పూజగది లాంటి మన దేశంలో జీవులను హింసించి తినే మాంసాహారం మానేద్దామని రాయజగపతిరాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కరపత్రాలు ప్రదర్శించారు. పిరమిడ్ ప్రతినిధి పాలడుగుల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సరసమైన ధరలకు వంట నూనె: బడేటి

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ... వినియోగదారులకు సరసమైన ధరలకే ప్రభుత్వం నిత్యావసర సరకులు అందజేస్తోందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. పత్తేబాద రైతు బజారులో పామాయిల్, సన్‌ఫ్లవర్ నూనె పొట్లాలను రాయితీపై శుక్రవారం వినియోగదారులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ... ఎన్డీయే అధికారంలోకి వచ్చాక, వివిధ నిత్యావసరాల ధరలు అదుపులోకి వచ్చాయన్నారు. రైతు బజారుతో నియోజకవర్గంలో మరో అయిదు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.



వినియోగదారుకు నూనె పొట్లాం అందజేస్తున్న ఎమ్మెల్యే చంటి

ఆలయాభివృద్ధికి సహకరిస్తా.. ఏలూరు గ్రామీణ: గంగానమ్మ ఆలయాభివృద్ధికి సహకరిస్తామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. స్థానిక పడమరవీధిలో వెలసిన పాత గంగానమ్మ ఆలయాన్ని శుక్రవారం సందర్శించారు. మహిషాసురమర్దిని అలంకరణలోని అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కో-ఆప్షన్ సభ్యుడు చోడే వెంకటరత్నం, నాయకులు ఎస్‌ఎమ్ఆర్ పెదబాబు బొద్దాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

గణపవరం, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఆరోగ్య సహాయకుడు నామాల రాజు అన్నారు. కాశిపాడులో ఇంటి, పరిసరాల శుభ్రతపై శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. దోమ కాటుతో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధానంగా సాయంత్రం వేళ దోమలు ఇళ్లలోకి రాకుండా వేపాకు పొగ వేసుకోవాలని సూచించారు. ఎవరైనా అనారోగ్యం బారిన పడితే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని ఆయన కోరారు. ఆశా కార్యకర్త కృష్ణ కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రశంసలు

ఉంగుటూరు, నిడమర్రు, పెదపాడు- న్యూస్‌టుడే: అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఇటీవల ఏలూరులో విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి ఐసీడీఎస్ ఆధ్వర్యాన వట్లూరు టీటీడీ సీలో సంయుక్త కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి చేతుల మీదుగా శుక్రవారం ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఉంగుటూరు మండలం నారాయణపురం, నిడమర్రు మండలం పత్తేపురం ఉన్నత పాఠశాలల విద్యార్థినులు జి.కావ్యశ్రీ, సిరిశెట్టి అమృత లక్ష్మీ సాయి, పెదపాడు మండలం వట్లూరులోని గురుకుల బాలికల పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థినులు పత్రాలు అందుకున్న వారితో ఉన్నారు. వారిని ప్రధానోపాధ్యాయులు షేక్ నాగూర్ మీరా సాహెబ్, పీవీ సత్యనారాయణ, ప్రధానాచార్యురాలు దాసరి మేరీ ఝాన్సీరాణి అభినందించారు.



జేసీ నుంచి ప్రశంసా పత్రాలు అందుకుంటున్న విద్యార్థినులు కావ్యశ్రీ, అమృత



ఉంగుటూరు: ప్రదర్శన నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, కార్యకర్తలు

బాలికలను చదవనిద్దాం.. ఎదగనిద్దాం

కవ్వకుంట(పెదవేగి), న్యూస్‌టుడే: ఆడ పిల్లలను చదివించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఇన్‌ఛార్జి తహసీల్దారు భ్రమరాంబ అన్నారు. కవ్వకుంట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారన్నారు. వివక్షకు తావిలేకుండా బాలికలను చదివించాలని కోరారు.

చేబ్రోలు(ఉంగుటూరు): బాలికల శ్రేయస్సుకు ప్రతిఒక్కరూ తోడ్పాటునందించాలని సర్పంచుల సంఘం నియోజకవర్గ అధ్యక్షురాలు రాంధే లక్ష్మీ సునీత అన్నారు. చేబ్రోలులో బేటీ బచావో.. బేటీ పఢావోపై అవగాహన ప్రదర్శన చేపట్టారు. సూపరింటెండెంట్ ఆంజనేయబాబు, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు శారదా మణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏలూరు గ్రామీణ: చాటపర్రులో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యనారాయణమ్మ ఆధ్వర్యంలో బాలికా దినోత్సవం నిర్వహించారు.

నిడమర్రు గ్రామీణం: బాలికలు అవకాశాలు అందిపుచ్చుకుని అన్నిరంగాల్లో రాణించాలని ఎంపీడీవో విజయకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బాలికా దినోత్సవం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రూపశ్రీ, కార్యకర్తలు హాజరయ్యారు.

భీమడోలు: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి ఆధ్వర్యాన బాలికా దినోత్సవం నిర్వహించారు. బాలికల సంరక్షణ, హక్కులు, విద్య, బాల్య వివాహాల నివారణ తదితరాలపై సదస్సు ఏర్పాటు చేశారు. అనంతరం మానవహారంగా ఏర్పడి.. ప్రతిజ్ఞ చేశారు. ఎంఈవో భాస్కరరావు, పర్యవేక్షకురాళ్లు ఎండీ షహనాజ్, ఎం.కవిత, ఎస్‌కె.నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.



భీమడోలు: మానవహారంగా ఏర్పడిన అంగన్‌వాడీలు, మహిళలు

4 కిలోమీటర్లు... రూ.40 లక్షలు



అయిదేళ్ల వైకాపా పాలనలో గుణపర్రు రహదారిపై కనీసం గుంతలు కూడా పూడ్చలేదు. ఫలితంగా ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనిపై ఆగస్టులో 'కీలక రహదారి.. అధ్వానంగా మారి' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించి రహదారికి మోక్షం లభించేలా చర్యలు చేపట్టారు. గుణపర్రు పందె కోడు వంతెన నుంచి గుణపర్రు గ్రామం వరకున్న సుమారు 4 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణానికి రూ.40 లక్షలు కేటాయించారు. 'తొలుత గుంతలు పూడ్చి, ఆపై మెటల్ పోసి చదును చేస్తాం. తర్వాత తారు పోస్తాం' అని ర.భ.శాఖ జేఈ భాస్కరరావు తెలిపారు. **- న్యూస్‌టుడే, నిడమర్రు గ్రామీణం**

ఈనాడు కథనానికి స్పందన

తనువు చాలించి.. ఆకలి తీర్చి!



నిడమర్రులో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ శునకం శుక్రవారం మృతి చెందింది. అప్పటి వరకు తల్లితో ఆడుకున్న కుక్క పిల్లలు విషయాన్ని తెలుసుకోలేకపోయాయి. తల్లి దగ్గర కొచ్చి పాలు తాగాయి. తమ అమ్మ తిరిగిరాదని తెలియక.. దాని చుట్టూ తిరుగుతూ లేపేందుకు యత్నించాయి. తల్లి కుక్క ఎంతకీ లేవకపోవడంతో... అక్కడే అరుస్తూ దీనంగా కూర్చొన్నాయి. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు కంట నీరు పెట్టుకున్నారు. **- న్యూస్‌టుడే, నిడమర్రు**

పోలవరం

• పోలవరం • చింతలపూడి

ఎన్డీయే అభ్యర్థి విజయానికి కృషి: ఎమ్మెల్యే

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ఓటర్ల నమోదుకు సంబంధించి స్థానిక సూర్య కల్యాణ మండపంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల కూటమి పార్టీల శ్రేణులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో రోషన్‌కుమార్ మాట్లాడుతూ పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించారు. అనంతరం ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థిని కార్యకర్తలు, నాయకులకు పరిచయం చేశారు. నాయకులు దాసరి శ్యామ్‌చంద్ర శేషు, రావూరి కృష్ణ, సాయిల సత్యనారాయణ, మండవ లక్ష్మణరావు, రాజాన సత్యనారాయణ, పరిమి సత్యనారాయణ, కిలారు సత్యనారాయణ, పారేపల్లి రామారావు, షేక్ ముస్తఫా, నంబూరి రామచంద్రరాజు, కరుటూరి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రోషన్ కుమార్

ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా శ్రీనివాస్

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం మండల ఈవోపీఆర్డీ ఈఎస్ఎస్ శ్రీనివాస్‌కు అదనంగా ఎంపీడీవో బాధ్యతలు శుక్రవారం అప్పగించారు.

మరుగుదొడ్లు సరే.. నీరేది?



కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: పరింపూడి-2 గ్రామ సచివాలయ భవనాల నిర్మాణం చేపట్టిన చోట ఉద్యోగులు, కార్యాలయ పనుల నిమిత్తం వచ్చే ప్రజల అవసరాల కోసం కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మించారు. ఇందుకు రూ.3 లక్షలు వెచ్చించారు. కానీ నీటి సదుపాయం విస్మరించారు. ఇటీవలి వరకు ఆ పక్కనే మండల పరిషత్తు ఉద్యోగుల నివాస సముదాయంలోని ఓ భవనంలో కొనసాగిన గ్రామ సచివాలయాన్ని ఆ పాత భవనం శిథిలం కావడంతో రైతు సేవా కేంద్రంలోకి మార్చారు. కానీ అక్కడ నీటి వసతి లేకపోవడంతో అటు ఉద్యోగులు ముఖ్యంగా మహిళలు, ఇటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీకృష్ణ మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని చెప్పారు.



జంగారెడ్డిగూడెం: మహిషాసురమర్దనిగా ముత్యాలమ్మ



గ్రామ దేవత గంగానమ్మ



కనకదుర్గమ్మ



నూకాలమ్మ



విజయదుర్గమ్మ

అయిగిరి నందిని.. నందితమేదిని..!

శరన్నవరాత్రి ఉత్సవాల్లో మహర్నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల్లోని అమ్మవార్లు శుక్రవారం మహిషాసురమర్దనిగా దర్శనమిచ్చారు. ఆయా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పలు చోట్ల బతుకమ్మలను సమర్పించారు. అన్నసమారాధనలు నిర్వహించారు. చింతలపూడి విశ్వనాథ మఠంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెం గ్రామ దేవత గంగానమ్మను దర్శించుకున్నారు. జంగారెడ్డిగూడెం వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి 108 రకాల హారతులు ఇచ్చారు. టి.నరసాపురం మండలం బొర్రంపాలెం, వెంగపాడు, వీరభద్రవరం వంటి గ్రామాల్లో భవానీ మాలలు ధరించిన 150 మంది ఇరుముడులతో విజయవాడలోని కనకదుర్గమ్మ వారి దర్శనానికి తరలివెళ్లారు. - న్యూస్‌టుడే, బృందం



పోలవరంలో వాసవీ కన్యకాపరమేశ్వరి



గూటాలలో..



బయ్యనగూడెం శ్రీచక్రసహితకనకదుర్గమ్మ




ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ



జంగారెడ్డిగూడెం కన్యకాపరమేశ్వరికి 108 రకాల హారతులు

పొదల మధ్య పరివర్తకం



పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం మండలం ప్రగడపల్లి శివార్లలో విద్యుత్తు పరివర్తకం చుట్టూ తుప్పలు పెరగడంతో ప్రమాదకరంగా మారిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాని ద్వారా పొలాల్లోని మోటార్లకు విద్యుత్తు సరఫరా జరుగుతోంది. ఎప్పుడు ఏం జరుగుతోందోనన్న భయాన్ని వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ట్రాన్స్‌కో ఏఈ కె.సత్యనారాయణ మాట్లాడుతూ సిబ్బందిని పంపి తుప్పలు తొలగించేందుకు ఏర్పాటు చేస్తామన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం సమకూరింది. హైదరాబాద్‌లోని చాందనగర్‌కి చెందిన విస్సంశెట్టి రాధిక ఆ మొత్తాన్ని దేవస్థానం సూపరింటెండెంట్ రాజుకి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతను ప్రత్యేకంగా అభినందించి, స్వామివారి ప్రసాదాలు, నిత్యాన్నదాన పత్రం అందజేశారు.



దాతకు పత్రం అందజేస్తున్న సూపరింటెండెంట్ రాజు



మాట్లాడుతున్న ప్రభాకర్

మానవతావాది రతన్ టాటా

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: అత్యంత దేశభక్తి కలిగిన మహోన్నత వ్యక్తి రతన్ టాటా అని సీపీఐ రాష్ట్ర కమిటీ కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ పేర్కొన్నారు. కొయ్యలగూడెంలో సత్యసాయి మంచి నీటి పథకం కార్మికుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ కరోనా సమయంలో రతన్ టాటా చేసిన సేవలు మరువలేనివన్నారు. టాటా మరణంపై మౌనం పాటించి నివాళులర్పించారు. జమ్మి శ్రీను, జి.శివసత్యనారాయణ, ఆచంట సత్యనారాయణ, పిల్లి నాగవీరబాబు పాల్గొన్నారు.

కామవరపుకోట (జంగారెడ్డిగూడెం), న్యూస్‌టుడే: పారిశ్రామిక వేత్త రతన్ టాటా విలువలు కలిగిన గొప్ప మానవతావాది అని సీపీఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు అన్నారు. టాటా మృతికి శుక్రవారం కామవరపుకోటలో సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఆదాయంలో 65 శాతం ప్రజల అవసరాలకు ఉదారంగా ఇచ్చిన మహనీయుడన్నారు. నాయకులు కంకిపాటి బుచ్చిబాబు, ఉద్దేటి సత్యనారాయణ, చలమల శ్రీనివాసరావు, స్వామిదాసు, సిద్ధా తదితరులు పాల్గొన్నారు.

కడుపు నొప్పితో కూలీ మృతి

టి.నరసాపురం, న్యూస్‌టుడే: కడుపు నొప్పితో చికిత్స పొందుతూ గ్రీన్‌ఫీల్డ్‌హైవే కూలీ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అమర్‌సింగ్ (32) గ్రీన్‌ఫీల్డ్‌హైవే నిర్మాణ కూలీగా పనిచేస్తూ, సింగరాయిపాలెం సమీపంలో ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం నాలుగు గంటలకు కడుపు నొప్పి రావడంతో, సహచరులు చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి సోదరుడు సంజయ్‌సింగ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనంపై రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై జబీర్ కథనం మేరకు.. పట్టణానికి చెందిన జె.శ్రీనివాసరావు.. ఈ నెల 9న ద్విచక్ర వాహనంపై 240 కేజీల రేషన్ బియ్యం మూటలను తరలిస్తుండగా.. స్థానిక బుట్టాయగూడెం రోడ్డులో పట్టుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

తెలంగాణ మద్యం.. కుక్కునూరు, న్యూస్‌టుడే: కుక్కునూరు మండలం బోనగిరిలో తెలంగాణ రాష్ట్రం మద్యం విక్రయిస్తున్న పి.ధనలక్ష్మి అనే మహిళపై, ఆమెకు మద్యం సరఫరా చేసిన సీతారామనగరానికి చెందిన బోలిగొండ అంజనరావు అనే వ్యక్తిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ రమేశ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా 15 సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

పశువుల వాహనం.. వేలేరుపాడు, న్యూస్‌టుడే: కబేళాకు అక్రమంగా పశువులు తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అల్లూరినగరం నుంచి మేడేపల్లి వైపు వెళుతున్న వాహనంలో రెండు పశువులను గుర్తించి, నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కేవీ రామారావు తెలిపారు.

జూద స్థావరాలపై దాడి

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం శివారు పేరంపేట రోడ్డులోని జూద స్థావరంపై గురువారం అర్ధరాత్రి దాడి చేసి, అయిదుగురిని అదుపులోకి తీసుకుని, రూ.5300 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జబీర్ తెలిపారు. ★ శ్రీనివాసపురం రోడ్డులో జూద స్థావరంపై దాడిచేసి ఆరుగురిని అదుపులోకి తీసుకుని, రూ.4200 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జబీర్ తెలిపారు.

పేరు మారింది!

ఈనాడు కథనానికి స్పందన

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: 'పేరు మారినా.. తీరు మారదా' శీర్షికన ఈ నెల 5న 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి కొయ్యలగూడెం మండల సమాఖ్య ఏపీఎం శ్రీనివాస్ స్పందించారు. వైకాపా ప్రభుత్వం పేరుతో ఉన్న కార్యాలయ నామ ఫలకాన్ని 'మండల సమాఖ్య కార్యాలయం- సెర్ఫ్ డీఆర్డీయే'గా మార్పు చేసి కొత్త నామ ఫలకాన్ని అమర్చినట్లు తెలిపారు.



గోదాములో కార్యాలయానికి ఏర్పాటు

పోలవరం, న్యూస్‌టుడే: పట్టిసీమ ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘ భవనం శిథిలావస్థకు చేరడంతో మూడేళ్లుగా అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పాత భవనాన్ని తొలగించి దాని స్థానంలో 500 టన్నుల గోదాము నిర్మించారు. అందులోనే కొంత భాగం కార్యాలయంగా ఉపయోగించుకునేందుకు వీలుగా రూ.6 లక్షలతో చేపట్టే పనులకు శనివారం పూజలు చేయనున్నట్లు సంఘ కార్యదర్శి గంగాధర్ చెప్పారు. దీనిపై రైతులు పలు సందేహాలు లేవనెత్తారు. నిధులు ఎక్కడి నుంచి తీసుకొస్తారని ప్రశ్నించారు.

రక్త పరీక్షలకు.. పోలవరం, న్యూస్‌టుడే: వింజరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొన్నేళ్లుగా ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడ మూడు రోజులు పాటు రక్త పరీక్షలు చేసేందుకు వీలుగా ఎల్‌ఎన్డీపేట పీహెచ్‌సీలో పని చేస్తున్న వ్యక్తికి అదనపు బాధ్యతలు అప్పగించినట్లు వింజరం పీహెచ్‌సీ వైద్యాధికారి మురళీధర్ చెప్పారు. ప్రతి మంగళవారం, గురువారం, శనివారం వింజరంలో, మిగిలిన రోజుల్లో ఎల్‌ఎన్డీపేటలో రక్తపరీక్షలు చేస్తారన్నారు.

ప్రభుత్వం ధరకు వంట నూనె సరఫరా

పోలవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వం నిర్దేశించిన ధరకు వంట నూనెలు విక్రయించేందుకు పోలవరంలో ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ సాయిరాజు చెప్పారు. పెద్ద రామాలయం సమీపంలోని దుకాణంలో శనివారం విక్రయాలు ప్రారంభించనున్నట్లు ఆయన చెప్పారు.

తెదేపా సభ్యత్వ నమోదు

చింతలపూడి, న్యూస్‌టుడే: మండలంలోని పొనుకుమాడులో తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. నాయకులు తాళ్లూరి చినబాబు, కొప్పెర్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తుపాను ముప్పుతో కర్షకుల్లో కలవరం

చాట్రాయి, న్యూస్‌టుడే: రాష్ట్రానికి మరోసారి తుపాను ముప్పుందని హెచ్చరికలు రావడంతో మెట్ట ప్రాంత మండలాల రైతుల్లో కలవరం మొదలైంది. ఈ నెల 13 నుంచి 15 మధ్య వాయుగుండంగా మారుతుందని తెలియడంతో వరిసాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట కంకులు పాలు పోసుకునే దశలో ఉన్నాయి. ముందుగా నాట్లు వేసిన చోట కోతలు పూర్తి కాగా ధాన్యాన్ని ఆరబెట్టారు. పట్టాలు పట్టుకుని రోజంతా అక్కడే కాపాలా కాస్తున్నారు. వర్షాలు పంటను ఇంటికి చేరుస్తాయా అనే సందేహం కర్షకుల్లో నెలకొంది.

క్రికెట్ పోటీలు ప్రారంభం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం ప్రీమియర్ లీగ్ పేరుతో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు ప్రారంభించారు. తొలి పోటీలో తిరువూరు-నిడదవోలు జట్లు తలపడ్డాయి. కార్యక్రమంలో నిర్వాహకులతో పాటు తెదేపా నాయకులు పరిమి సత్యనారాయణ, పెనుమర్తి రామ్‌కుమార్, కొండ్రెడ్డి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న బొరగం

శిథిల భవనం.. సేవలకు భయం.. భయం!

ప్రతిపాదనలకూ నోచుకోని దుస్థితి

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే

కొయ్యలగూడెం మండలంలో పలు కీలక ప్రభుత్వ శాఖలకు చెందిన భవనాలు శిథిలస్థితికి చేరాయి. కొద్దిపాటి చినుకులకే శ్లాబులు కారుతూ గదుల్లో నేల చెమ్మగిల్లుతోంది. ఉద్యోగులు క్షణక్షణం భయంభయంగా విధులు నెట్టుకొస్తున్నారు. దీనిపై ఆయా అధికారులు మాట్లాడుతూ ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నామని చెప్పారు.



అంకాలగూడెంలో ఓ అంగన్‌వాడీ కేంద్ర భవనమిది. పూర్తిగా పాడైంది. కిటికీలు, గుమ్మాలు, శ్లాబు, ఫ్లోరింగ్ దెబ్బతిన్నాయి. కనీస మరమ్మతులు చేయించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



కొయ్యలగూడెం మండలంలోని దివ్యాంగ బాలల కోసం సుమారు పదేళ్ల కిందట ఏర్పాటు చేసిన భవిత కేంద్రం ఇప్పటికీ శాశ్వత భవనానికి నోచుకోలేదు. ఎంపీడీవో కార్యాలయం వెనుక దశాబ్దాల కిందట నిర్మించిన సిబ్బంది నివాస సముదాయ భవనాల్లో ఒకదాంట్లో ప్రస్తుతం తరగతులు నిర్వహిస్తున్నారు. 20 మంది బాలలు శిక్షణ పొందుతున్న ఈ భవనం పూర్తిగా పాడైంది. ద్వారబంధాలు ఊడిపోతున్నాయి. శ్లాబు, గోడలు చెమ్మగిల్లి నీరు కారుతుంటాయి.



మండలంలో పెద్దదైన పరింపూడి పంచాయతీ కార్యాలయానికి శాశ్వత భవనం లేదు. వైకాపా ప్రభుత్వ హయాంలో సచివాలయ భవనం మంజూరైంది. ఉన్నదాన్ని పడగొట్టడంతో తాత్కాలికంగా ఓ మహిళా సంఘ భవనంలోకి కార్యాలయం తరలించారు. ప్రస్తుత భవనం శ్లాబు కారుతూ కార్యాలయంలోని కంప్యూటర్లు, ఇతర సామగ్రి, దస్త్రాలు తడిసి పాడవుతున్నాయని ఉద్యోగులు చెబుతున్నారు.



ఈ భవనంలో ఉపాధి హామీ పథకం కార్యాలయం నిర్వహిస్తున్నారు. గోడలు బీటలు వారి పగుళ్లు తీశాయి. నేల చెమ్మగిల్లి తడిగా ఉంటోంది. పలు పంచాయతీల్లో నిర్వహిస్తోన్న ఉపాధి పనుల దస్త్రాలన్నీ అలమరల్లో భద్రపరుస్తున్నారు. చెమ్మ కారణంగా చెదలు చేరి పాడవతున్నాయి. కిటికీలు, తలుపులు ఊడిపోతున్నాయి. సన్‌షేడ్‌లపై తుప్పలు పెరిగి చిట్టడవిని తలపిస్తున్నాయి. విష పురుగుల సంచారం ఎక్కువగా ఉందని సిబ్బంది భయాందోళన చెందుతున్నారు.

పట్టణవాసులకు అందని రాయితీ ఉల్లి, టమాటా

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: కూరగాయల ధరలు పెరిగిన కారణంగా రాష్ట్ర ప్రభుత్వం రాయితీ ధరలకు ఉల్లి, టమాటా, మంచి నూనె వంటివి సరఫరా చేస్తున్నా జంగారెడ్డిగూడెం వాసులకు అవి దక్కడం లేదు. ఇక్కడ రైతు బజారు లేకపోవడంతో వాటి పంపిణీని మార్కెటింగ్ అధికారులు విస్మరించారు. టమాటా కేజీ రూ.70 నుంచి రూ.100కు అమ్ముతున్నారు. ఉల్లిపాయలు కేజీ రూ.60 ఉంది.

బాలికా విద్యతో మెరుగైన సమాజం

పోలవరం, న్యూస్‌టుడే: విద్యతోనే బాలికలకు సమాజంలో గుర్తింపు వస్తుందని పోలవరం ఐసీడీఎస్ పీడీ ఈఎస్ఏ శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలవరం పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా మహిళా ఉద్యోగులే ఎక్కువగా కనిపిస్తున్నారని, గ్రామీణ ప్రాంతాల్లోని బాలికలు ఇంటర్‌తో సరిపెట్టకుండా మరింత ముందుకు సాగాలన్నారు.

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: నేటి సమాజంలో బాలికలు ధైర్యంగా ముందుకు సాగాలని ఎంపీపీ కర్రా పోచమ్మ అన్నారు. జీలుగుమిల్లి మండల పరిషత్ కార్యాలయంలో బాలికా దినోత్సవం నిర్వహించారు. బాలిక చట్టాలపై అవగాహన పెంపొందించాలని సూచించారు. అనుచిత ప్రవర్తన వారికి దూరంగా ఉండాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకుని, ఆరోగ్యకర జీవనం సాగించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ తులసి, ఎంపీడీఓ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేలేరుపాడు, న్యూస్‌టుడే: నేటి పరిస్థితుల్లో బాలికలు చదువుకుంటేనే ఉన్నత స్థాయికి చేరుకోగలరని డాక్టర్ ఆశ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన బాలికా దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పలు జాగ్రత్తలు తెలియజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మయూరి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, బాలికలు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం ఎంపీడీవో కార్యాలయం వద్ద మహిళా, శిశు అభివృద్ధి పథకం ఆధ్వర్యంలో అయిదుగురు కిశోర బాలికలను సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు బాలిక, మహిళా సంక్షేమ చట్టాలపై అవగాహన కల్పించారు.

చింతలపూడి, న్యూస్‌టుడే: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో లింగవివక్ష, బాల్యవివాహాలు, బాలికల విద్య తదితర అంశాలపై అవగాహన కల్పించారు.



బుట్టాయగూడెంలో కిశోర బాలికలను సన్మానిస్తున్న అధికారులు



కొయ్యలగూడెంలో అవగాహన ప్రదర్శనలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: లింగ వివక్ష లేని సమానత్వ భావనతో మెలగాలని చిన్నారులను నుంచి బాలలను తీర్చిదిద్దాలని జడ్పీటీసీ సభ్యురాలు దాసరి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. కొయ్యలగూడెం ఎంపీడీవో కార్యాలయంలో బాలికా దినోత్సవం నిర్వహించారు. బాలికల సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తోన్న పలు పథకాలను సీడీపీవో కె.కిరణ్‌కుమార్ వివరించారు. వివిధ పరిస్థితుల నుంచి విముక్తి పొందిన నలుగురు బాలికలను ఎంపీపీ గంజిమాల రామారావు, తహసీల్దార్ కె.లక్ష్మణరావు తదితరులు సత్కరించారు. అంతకు ముందు అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాల బాలికలతో కలిసి అవగాహన ప్రదర్శన నిర్వహించారు.

టి.నరసాపురం, న్యూస్‌టుడే: బాలికల విద్యతోనే సమాజం ఏర్పడుతుందని సర్పంచి మోదుగు అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం టి.నరసాపురంలో నిర్వహించారు.

శాకాహారంపై ఇంటింటి ప్రచారం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జీవ హింస మాని శాకాహారం తీసుకోవాలని మహా కరుణ యాగం పేరుతో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మహాకరుణ ధర్మ ప్రచార పరిషత్తు ఛైర్మన్ దాట్ల రాయ జగపతి రాజు పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెం పిరమిడ్ వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పూజగది లాంటి మన దేశంలో జీవులను హింసించి తినే మాంసాహారం మానేద్దామని రాయజగపతిరాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కరపత్రాలు ప్రదర్శించారు. పిరమిడ్ ప్రతినిధి పాలడుగుల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

దారి.. నరకంగా మారి!

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కొయ్యలగూడెంలో పోతవరం రహదారి నుంచి పరింపూడికి ముఖ్య రహదారి గోతులతో అధ్వానంగా తయారైంది. ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం కూడలి నుంచి పరింపూడి రామాలయం వరకు పూర్తిగా పాడైంది. పాఠశాలలకు వెళ్లే బాలికలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. బాలికల వసతిగృహాలు, పశువైద్యశాల, గ్యాస్ ఏజెన్సీకి వెళ్లే మార్గం కావడంతో పునర్నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీరాజ్ ఏఈ సురేశ్ మాట్లాడుతూ సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం 200 మీటర్ల మేర పనులకు ఉపాధి హామీ నిధులు రూ.8 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు.



నూజివీడు
• నూజివీడు • కైకలూరు

బల్లల వితరణ

మండవల్లి, న్యూస్‌టుడే: హిందూ ధర్మ సమితి ఆధ్వర్యంలో మండవల్లి మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాలు, ప్రధాన కూడళ్లలో సిమెంట్ బల్లలను ఏర్పాటు చేశారు. చాలా ఆలయాల వద్ద భక్తులు కూర్చోవడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండవల్లి గంగానమ్మ ఆలయం, శ్రీకృష్ణ మందిరం, అగ్రహారం రామాలయం, భైరవపట్నం, సుబ్బారావుపేట, మూలపేట, మోదుగుమూడి గ్రామాల్లో బల్లలు ఏర్పాటు చేశారు. సభ్యులు పసుపులేటి శ్రీనివాసరావు, నల్లమోతు సురేంద్ర, పూడి సురేశ్, వేణుగోపాల్, రత్నరావు, శివకృష్ణ, ఆదినారాయణ, భోగాది సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శోభనాచలునికి ప్రత్యేక పూజలు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: నూజివీడు మాజీ ఎమ్మెల్యే ప్రతాప అప్పారావు జన్మదినం సందర్భంగా శుక్రవారం ఆగిరిపల్లిలోని శోభనాచలుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి సారె సమర్పణ

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు వైఎస్సార్ కాలనీ కరకట్టలోని విజయదుర్గామాత ఆలయంలో దసరా మహోత్సవాలను పురస్కరించుకుని గ్రామస్థులు శుక్రవారం అమ్మవారికి సారె సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు సాంప్రదాయ వస్త్రాలంకరణలో అమ్మవారి ఆలయానికి చేరుకుని పాలు పొంగళ్లు వండి నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు రకాల పిండి వంటలు, పండ్లు పరిమళ పుష్పాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: నూజివీడు పట్టణం ఎమ్మార్ అప్పారావు కాలనీలో ఎల్ అండ్ టీ బిల్డింగ్ వెనుక వీధి దీపం వెలగడం లేదు.

- శకుంతల, నూజివీడు

సమాధానం: వీధి దీపం వెలిగేలా చర్యలు తీసుకుంటాం.

- లక్ష్మీనారాయణ, మున్సిపల్ డీఈ

కైకలూరు, న్యూస్‌టుడే

సమస్య: మండలంలోని కొట్టాడ గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కన సిమెంటు రోడ్డుపై డ్రెయినేజీ మురుగునీరు ప్రవహిస్తోంది. నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు వృద్ధి చెంది స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

- హరీష్, గ్రామస్థుడు

సమాధానం: డ్రెయినేజీ మురుగు నీరు మళ్లించి పారిశుద్ధ్య చర్యలు నిర్వహించి దోమల మందు పిచికారీ చేయిస్తాం.

- శివన్నారాయణ, పంచాయతీ కార్యదర్శి

మహోగ్రరూపం.. మహిషాసుర సంహారం

న్యూస్‌టుడే, బృందం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల్లో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. 9వ రోజు అమ్మవారు మహిషాసురమర్దనిగా దర్శనమిచ్చారు. ముసునూరు, రమణక్కపేట, గోపవరం, కొర్లగుంట, అక్కిరెడ్డిగూడెం గ్రామాల్లో, బలివేలో రాజరాజేశ్వరీదేవి మహిషాసురమర్దనిగా దర్శనమిచ్చారు. నూజివీడు పట్టణంలోని కోట మహిషాసురమర్దని అమ్మవారిని మహిషాసురమర్దనిదేవిగా అలంకరించారు. రామయామ్మరావుపేటలోని దుర్గాదేవి ఆలయంలో మున్సిపల్ తెదేపా ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. చాట్రాయిలో వికాస్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి పందిరిలో, కృష్ణారావుపాలెంలో యాదవ బజారులో, ఆరుగోలనుపేటలో లక్ష్మమ్మ, అంకమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.



భాస్కరరావుపేటలో పోలేరమ్మ

కైకలూరు నియోజకవర్గంలో..

భాస్కరరావుపేటలోని పోలేరమ్మ మహిషాసురమర్దని రూపంలో దర్శనమిచ్చారు. కోరుకొల్లులోని సోమేశ్వరాలయం, శ్రీరాజరాజేశ్వరీదేవి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. కైకలూరు శ్యామలాంబ వారు, వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవార్లను పార్వతీదేవిగా అలంకరించారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. గురజలోని గంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి వేడుకల్లో అమ్మవారు భద్రకాళికాదేవిగా, ముదినేపల్లి పెదరామాలయంలో, పెయ్యేరులోని కనకదుర్గ ఆలయంలో, దేవపూడి విజయదుర్గాదేవి, వణుదుర్రు వీరఅంకమ్మ ఆలయాల్లో మహిషాసురమర్దనిగా అమ్మవారు దర్శనమిచ్చారు. వణుదుర్రులో, కాకరవాడలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఆగిరిపల్లి వరాహ పుష్కరిణి సమీపంలో, యాదవుల మండపం దగ్గర, రజక వీధిలో, వట్టిగుడిపాడులో అమ్మవారు మహిషాసురమర్దని అలంకరణలో దర్శనమిచ్చారు. లోకుమూడి దత్తాశ్రమంలో అమ్మవారు మహిషాసురమర్దనిగా దర్శనమిచ్చారు. మండవల్లి మల్లేశ్వరస్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇంగిలిపాకలంక శివగుళ్లంకమ్మ తల్లి మహిషాసురమర్దనిగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మహా చండీ యాగం నిర్వహించారు.



బలివే: మహిషాసురమర్దని



నూజివీడులో..



చాట్రాయిలో..



ఆగిరిపల్లిలో..



వింజరంలో..



కొల్లేటికోటలో..



గురజలో..



మండవల్లిలో..

సినిమాలు

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	దేవర
సత్యనారాయణ మినీ	జనక అయితే గనక
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	మార్టిన్
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	విశ్వం
ద్వారక సినిమాస్ స్క్రీన్3	వెట్టయన్
ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్	దేవర
కైకలూరు	
విజయలక్ష్మి జీ3 సినిమాస్	దేవర
మాగంటి సినిమాస్	విశ్వం
శ్రీవెంకటరమణ సినిమాస్	వెట్టయన్
ముదినేపల్లి: పూర్ణిమ	దేవర

దేవుడా.. నువ్వే కాపాడు!

తుపాను ముప్పు.. కర్షకుల్లో కలవరం



చాట్రాయి, న్యూస్‌టుడే: రాష్ట్రానికి మరోసారి తుపాను ముప్పుందని హెచ్చరికలు రావడంతో మెట్ట ప్రాంత మండలాల రైతుల్లో కలవరం మొదలైంది. ఈ నెల 13 నుంచి 15 మధ్య వాయుగుండంగా మారుతుందని తెలియడంతో వరిసాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట కంకులు పాలు పోసుకునే దశలో ఉన్నాయి. ముందుగా నాట్లు వేసిన చోట కోతలు పూర్తి కాగా ధాన్యాన్ని ఆరబెట్టారు. పట్టాలు పట్టుకుని రోజంతా అక్కడే కాపాలా కాస్తున్నారు. వర్షాలు పంటను ఇంటికి చేరుస్తాయా అనే సందేహం కర్షకుల్లో నెలకొంది.

రాష్ట్ర అభ్యున్నతే ధ్యేయం: మంత్రి

నూజివీడు, న్యూస్‌టుడే: రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పాలన సాగిస్తోందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు మండలం పల్లెర్లమూడిలో రూ.4 లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారికి మంత్రి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నామన్నారు. యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశగా నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వరద బాధితులకు 15 రోజుల్లోనే పరిహారం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



సీసీ రహదారికి శంకుస్థాపన చేస్తున్న పార్థసారథి

కూలిన చెట్టు.. రాకపోకలకు ఇక్కట్లు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: అల్లూరు శివారు రామచంద్రపురం వద్ద సింగరాయపాలెం- కోరుకొల్లు ప్రధాన రహదారిపై శుక్రవారం చెట్టు కూలింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. సాయంత్రం వరకు ఏ శాఖ అధికారులు చెట్టు తొలగింపునకు చర్యలు చేపట్టలేదు. దీంతో వాహనదారులు రహదారి మార్జిన్ దిగి రాకపోకలు సాగించారు.



పేదలకు కూటమి ప్రభుత్వం అండ

కైకలూరు, న్యూస్‌టుడే: నిరుపేదలకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ, తెదేపా నేత కమ్మిలి విఠల్ రావు అన్నారు. నిత్యావసర ధరలు అధికమైన తరుణంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు బజారులో రాయితీ వంట నూనెలు అందించాలని నిర్ణయించారు. శుక్రవారం స్థానిక రైతు బజారులో ఏర్పాటు చేసిన రాయితీ వంట నూనెల దుకాణాలను కూటమి శ్రేణులతో కలిసి ప్రారంభించారు. ఇక నుంచి చౌకధరల దుకాణాల్లోనూ నాణ్యమైన కందిపప్పు రాయితీపై అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో తెదేపా మండలాధ్యక్షుడు పి.త్రినాథ రాజు, తెదేపా పట్టణ అధ్యక్షుడు ఎండీ జానీ, కూటమి నాయకులు కొల్లి వరప్రసాద్, అన్నం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



వంట నూనె అందజేస్తున్న విఠల్‌రావు, నాయకులు

గ్రామాలకు సుస్తీ

● వర్షాలకు తోడు పారిశుద్ధ్య లోపం ● పంచాయతీలకు పట్టని ప్రజారోగ్యం



లోకుమూడిలో రోడ్డుపక్కన పడేసిన చెత్త

మండవల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేయడంతో వర్షాల వెంటే వ్యాధుల ముప్పుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వైరల్ జ్వరాలు, అతిసార వంటివి ప్రబలుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపడితేనే వ్యాధులు ప్రబలకుండా ఉంటాయి. కానీ నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తీవ్రంగా వేధిస్తున్నాయి. ముఖ్యంగా లంక గ్రామాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఒక పక్క ఉద్ధృతిగా ఉన్న కొల్లేరు మరో పక్క వర్షాలు, గ్రామాల్లో మురుగు నీరు నిల్వతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెత్త సంపద కేంద్రాలు పనిచేయకపోవడంతో చెత్త ఎక్కడ పడితే అక్కడే దర్శనమిస్తోంది. కొన్ని గ్రామాల్లో కనీసం బ్లీచింగ్ కూడా చల్లడం లేదని ప్రజలు వాపోతున్నారు.

ఎక్కడి చెత్త అక్కడే.. కైకలూరు నియోజకవర్గంలోని 110 పంచాయతీల్లో సుమారు 100 వాటిలో సంపద కేంద్రాలు నిర్మించారు. కానీ వాటిని వినియోగించకపోవడంతో రోడ్ల పక్కన చెత్త వేసి పెద్ద గుట్టగా మారిన తర్వాత నిప్పు పెడుతున్నారు. వర్షాకాలంలో ఈ గుట్టలు తడిసి ముద్దవడంతో నిప్పు పెట్టేందుకు కూడా వీలు లేకుండా ఉంది. దీంతో దుర్వాసన వస్తోంది. భరించలేక స్థానికులు అల్లాడుతున్నారు. కొల్లేరు ప్రాంతాలలో ఇంటి పరిసరాల్లో పెద్దఎత్తున పశువులు ఉండటంతో దోమల ఉద్ధృతి తీవ్రంగా ఉందని వాపోతున్నారు. పంచాయతీలలో ఫాగింగ్ యంత్రాలున్నా.. వాటిని వినియోగించిన దాఖలాలు కనిపించడం లేదు. 6 నెలలుగా మండవల్లి మండలంలోని ఒక్క గ్రామంలో కూడా దోమల మందు పిచికారీ చేయక పోవడంతో దోమల ఉద్ధృతితో ప్రజలు అల్లాడుతున్నారు.



చావలిపాడు కొళాయి ద్వారా వస్తున్న నీరు

నిర్వహణ శూన్యం

చాలా పంచాయతీల్లో తాగునీటి నాణ్యతను పరిశీలించే కిట్లు అటకెక్కాయి. రక్షిత పథకాల పిల్లర్ బెడ్లు పాడైపోయినా పట్టించుకోవడం లేదు. పైపు లైన్ లీకేజీ వద్ద తాగునీరు కలుషితమవుతోంది. దీంతో పాటు మంచినీటి చెరువుల్లో పేరుకుపోయిన చెత్తను కనీసం తొలగించిన పాపాన పోవడం లేదు. రక్షిత మంచినీటి కొళాయిల ద్వారా విడుదల చేస్తున్న నీరు తాగేందుకు ఏమాత్రం పనికి రావడం లేదు.

పనులు చేయిస్తున్నాం

అన్ని పంచాయతీల్లో పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించే విధంగా ప్రణాళిక చేశాం. చెత్త సేకరణ, మురుగు కాలువల పూడిక తీత, శుద్ధి చేసిన నీరు అందించేలా చర్యలు తీసుకుంటాం. కార్యదర్శులను అప్రమత్తం చేసి ప్రజా సమస్యలను పరిష్కరించేలా చూస్తాం.
- రామలింగేశ్వరరావు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో, మండవల్లి

లంచాలు ఇవ్వొద్దు.. ఆర్టీఐను ఆశ్రయించండి



అవగాహన ర్యాలీ చేస్తున్న ఐక్యవేదిక సభ్యులు

మండవల్లి, న్యూస్‌టుడే: ప్రజలకు సేవలు అందించాల్సిన అధికారులు లంచాల కోసం పనులు చేయకపోతే వెంటనే సమాచార హక్కు చట్టాన్ని ఆశ్రయించి సమస్యలు పరిష్కరించుకోవాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి ఎల్.ఎస్. భాస్కరరావు కోరారు. సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ... జంలో అవినీతిని అరికట్టేందుకు ఒకే ఒక్క ఆయుధం 2005 సమాచార హక్కు చట్టమని తెలిపారు. సభ్యులు అప్పారావు, సూర్యారావు, బండి రంగారావు, బాబ్జి, విజయ్, శ్రీనివాసరావు, ఆదిరావు, గంగరాజు, అర్జునరావు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో జడ్పీ ఛైర్‌పర్సన్

పెదపాడు, న్యూస్‌టుడే: మండలంలోని సత్యవోలులో జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ దంపతులు శుక్రవారం పర్యటించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో మహిషాసురమర్దినిగా అలంకరించిన అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకు ముందు ఆలయానికి చేరుకున్న జడ్పీ ఛైర్‌పర్సన్ దంపతులకు గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని స్థానికులు పద్మశ్రీ దృష్టికి తెచ్చారు. వాటిపై ఆమె సానుకూలంగా స్పందించారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం సమకూరింది. హైదరాబాద్‌లోని చాందానగర్‌కి చెందిన ... ఆ మొత్తాన్ని దేవస్థానం సూపరింటెండెంట్ రాజుకి శుక్రవారం అందజేశారు.

బాలికలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది



నూజివీడు: మొక్క నాటిన ఆర్డీవో వాణి తదితరులు

నూజివీడు, న్యూస్‌టుడే: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్డీవో ఎం.వాణి అన్నారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. బాలికలకు ఉన్న విద్య, ఆరోగ్య, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ రూపుమాపడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీడీపీవో నూరాణి, ఎండీవో సి. రామచంద్రనాథ్, స్నేహ ట్రస్ట్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నరేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

కైకలూరు, న్యూస్‌టుడే: బాలికలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఎంపీపీ అడవికృష్ణ అన్నారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రతి తల్లిదండ్రులు మగ పిల్లలతో సమానంగా బాలికలను సామాజిక, ఆర్థిక విద్యా భరోసాను కల్పించాలని సూచించారు. అనంతరం బాలికలకు పలు అంశాలపై పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఐసీడీఎస్ ... ఎంపీడీవో ఎండీ ఇబ్రహీం, వైఎస్ఆర్ చౌదరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వి.కృష్ణకుమారి, సాహెద ఖానం, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కైకలూరు: బహుమతులు అందజేస్తున్న కృష్ణ

ముసునూరు, న్యూస్‌టుడే: ఆడపిల్లలు అవకాశాలను అందిపుచ్చుకుని అన్ని రంగాల్లో రాణించాలని సర్పంచి కొండేటి విజయలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం ముసునూరులో అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు.

చాట్రాయి: ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గాయత్రి ఆధ్వర్యంలో చాట్రాయి జెడ్పీ కేంద్రంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. సీహెచ్‌వో జీవీ.రమణ, కార్యదర్శి నాగరాజు, సూపర్‌వైజర్ జె.ప్రభాకర్, ఏఎన్ఎం సుజాత పాల్గొన్నారు. పలువురు మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన సర్పంచ్‌ను సన్మానించారు.

ముదినేపల్లి, న్యూస్‌టుడే: సమాజంలో బాలికలు ఎదుర్కొనే అసమానతలు తొలగించి, వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఐసీడీఎస్ సీడీపీవో దీప్తి అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం కిశోర బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ ఝాన్సీ, ప్రసూన, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పెదఎడ్లగాడి వంతెనపై నిలిచిన నీటిలో వాహనాల రాకపోకలు

వంతెన.. ఇంతేనా..!

ఏలూరు - కైకలూరు ప్రధాన రహదారి పెదఎడ్లగాడి వంతెనపై ప్రమాదకర స్థితికి చేరింది. దీనిపై భారీ గోతులు పడటంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాన నీరు కిందికి పోయేందుకు ఏర్పాటు చేసిన రంధ్రాలు మూసుకుపోవడంతో.. చిన్నపాటి వర్షానికే వంతెనపై నీరు నిలిచిపోతోంది. రక్షణ గోడలపై మొక్కలు మొలిచి బీటలు వారుతున్నాయి. అధికారులు స్పందించి వంతెనకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు. - ఈనాడు, ఏలూరు



వంతెనపై భారీ గొయ్యి

పోలీసుల సేవా పథం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: దసరా నేపథ్యంలో కనకదుర్గమ్మ దర్శనార్థం విజయవాడకు కాలినడకన వెళ్తున్న భవానీ భక్తులకు ఏలూరు పోలీసులు పండ్లు, అల్పాహారం, మజ్జిగ, మంచినీరు శుక్రవారం పంపిణీ చేశారు. ఆశ్రం శివారు జాతీయ రహదారి తనిఖీ కేంద్రం వద్ద డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో వీటిని అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. పాదయాత్రగా జాతీయ రహదారిపై విజయవాడ వెళ్లే భక్తులు జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం భక్తుల సంచులకు రేడియం స్టిక్కర్లు అంటించారు.

పాడి రైతులకు అండగా సంక్షేమ పథకాలు

చాట్రాయి, న్యూస్‌టుడే: పాడి రైతులకు అండగా సంక్షేమ పథకాలను జిల్లా పాల సమితి అమలు చేస్తూ వాటిని సరైన సమయంలో అందించి పాల ఉత్పత్తిని పెంచేలా చేస్తుందని తిరువూరు పాల శీతలీకరణ కేంద్ర మేనేజర్ సాంబశివమూర్తి తెలిపారు. బూరుగుగూడెం పాలసేకరణ సంఘంలో శుక్రవారం ఆయన రైతులతో మాట్లాడారు. రాయితీపై అమలు చేసే పథకాలను వివరించారు. సంఘాధ్యక్షురాలు గడ్డం రాధా రుక్మిణి, సూపర్‌వైజర్ బయ్యా వెంకటేశ్వరరావు రైతులు పాల్గొన్నారు. సంఘ పరిధిలో సభ్యురాలు మారగాని వెంకటరావమ్మ ఇటీవల మృతి చెందగా క్షీరబంధు పథకంలో రూ.50 వేలు కుమారుడు సాంబశివమూర్తికి అందించారు.



పశు పోషకులతో మాట్లాడుతున్న సాంబశివమూర్తి



భాస్కరరావుపేట - పెదలంక రోడ్డు దుస్థితి

దారులు.. దారుణాలు!

కలిదిండి, కైకలూరు, న్యూస్‌టుడే: అక్కడ బాగానే ఉన్నాయ్.. ఇక్కడ బాగోలేదు అనడానికి వీల్లేకుండా నియోజకవర్గంలో ఎక్కడ చూసినా రహదారులు దారుణంగా దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వం రోడ్ల నిర్మాణం.. మరమ్మతులపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఫలితంగా ఈ దయనీయ స్థితి ఏర్పడింది. ప్రధాన మార్గాలు, అంతర్గత రహదారులు అన్న భేదం లేకుండా గుంతల మయంగా మారాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గుంతలు చెరువుల్లా మారుతున్నాయి.

ఇదీ పరిస్థితి

కలిదిండి మండలం గుర్వాయిపాలెం నుంచి పెదలంక వరకు 12 కిలోమీటర్లు ఉంది. దీనిలో 8 కిలోమీటర్లు ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో ఆరు గ్రామాలున్నాయి. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి.
● కోరుకొల్లు- దేవపూడి రోడ్డులో అడుగడుగునా గుంతలే. వర్షం పడితే చిత్తడిగా మారుతోంది. ఇది కృష్ణాజిల్లాకు ప్రధాన మార్గం. గంటకు 120 వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ● యడవల్లి నుంచి పెదలంక మార్గం లంక గ్రామాలకు ప్రాధాన్యం కలిగింది. ఈ గుంతల రోడ్డులో లంకవాసులు, ఆక్వా సాగుదారుల అవస్థలు ఇన్నీ అన్నీ కాదు. ● కైకలూరు మండలంలోని వరాహపట్నం- ఆటపాక, వరాహపట్నం- సీతనపల్లి, గోపవరం- ఆరుతెగలపాడు, ఆలపాడు- పందిరిపల్లిగూడెం, కొట్టాడ- జంగంపాడు రోడ్ల పరిస్థితి ఇదే విధంగా ఉంది.

ప్రతిపాదనలు పంపాం..

కోరుకొల్లు- కొచ్చెర్ల, గుర్వాయిపాలెం- పెదలంక, గోపవరం- ఆరుతెగలపాడు, వరాహపట్నం- సీతనపల్లి రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు అయ్యాయి. నియోజకవర్గంలోని మరికొన్ని రహదారులకు ప్రతిపాదనలను పంపించామని ఆర్ అండ్‌బీ డీఈ అనిల్ వివరించారు.



వరాహపట్నం - ఆటపాక రహదారి ఇలా..

చికిత్స పొందుతూ మృతి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిన ఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీహరిపురం శివారు చేవూరుపాలెం పరిధిలోని పెట్రోలు బంక్ వద్ద ఈనెల 6న రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఇందులో ఇక వాహనంపై ఉన్న కోనాల కిరణ్‌కుమార్, కుమార్తెలు సరయు, అమీనా తీవ్రంగా గాయపడగా, అతని భార్య నైనా అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. ఇందులో గాయపడిన మరో వాహనంపై వెళ్తున్న కృష్ణాజిల్లా బంటుమిల్లి మండలం మల్లపరాజుగూడేనికి చెందిన తాపీ మేస్త్రీ పుప్పాల సుబ్రహ్మణ్యం(26) విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆరు రోజులుగా మృత్యువుతో పోరాడుతూ శుక్రవారం ప్రాణాలు కోల్పోయాడు. అవివాహితుడైన సుబ్రహ్మణ్యంకు తండ్రి, తల్లి, తమ్ముడు, చెల్లి ఉన్నారు. ఎస్సై వెంకటకుమార్ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.